SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుక.. మన పత్రిక తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267

సమయం

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

**7036644111, 9490140565**

సంపుటి: 19 | సంచిక: 282 | ఎడిటర్ : అలీ ముర్తుజా | మంగళవారం 1 సెప్టెంబర్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల:రూ.5 |

## నగరంలో మూడు విషాదాలు

ప్రేమ వ్యవహారంతో కానిస్టేబుల్ ఆత్మహత్య

మనస్తాపంతో పదో తరగతి విద్యార్థి..

చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీ..

మూడు ఘటనలపై పోలీసుల దర్యాప్తు





2



కృష్ణా జలాలు తరలిపోతుంటే

## చోద్యమా?

- వెలిగొండపై హరీశ్‌రావు ఆగ్రహం
- తెలంగాణకు తీరని ద్రోహమని విమర్శ

**ఆడబిడ్డల భద్రత ప్రశ్నార్థకం!**

3

## ధరణి కన్నా దరిద్రంగా 'భూభారతి'!

- 22ఏతో 50 లక్షల మందికి ఇబ్బందులు: బీజేపీ
- నిషేధిత జాబితాపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- స్వతంత్ర సంస్థతో విచారణకు రామచందర్‌రావు డిమాండ్
- సెప్టెంబర్ 7లోగా పరిష్కరించకుంటే అసెంబ్లీ ముట్టడి: రఘునందన్

2





## తెలంగాణ కోసం కష్టపడ్డ నన్నే గెంటేశారు!

- ప్రశాంత్‌రెడ్డి 'శకుని' పాత్ర పోషించారు
- జీవితంలో ఆయనను మాత్రం క్షమించను
- నిజామాబాద్ పాంచజన్య సభలో కవిత భావోద్వేగం
- కేసీఆర్‌తో తనను విడదీశారని తీవ్ర ఆరోపణ
- కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నించారని విమర్శ

3



# 'ఇన్వెస్ట్ తెలంగాణ'కు గ్లోబల్ టచ్

డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో సమ్మిట్ ▪ ప్రజాభవన్‌లో ప్రత్యేక వార్‌రూమ్

సీనియర్ అధికారులతో కమిటీలు ▪ ఢిల్లీలో కర్టెన్ రైజర్‌కు సన్నాహాలు

ఏర్పాట్లపై రోజువారీ నివేదికకు భట్టి ఆదేశం

**హైదరాబాద్, ఆగస్టు 31:** 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026'ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సమ్మిట్ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రతి అంశాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించడంతో పాటు అవసరమైన నిర్ణయాలను వేగంగా తీసుకునేందుకు ప్రజాభవన్‌లో ప్రత్యేక వార్‌రూమ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై సోమవారం ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్క ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సబ్ కమిటీ సభ్యుడు, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు. సమ్మిట్‌కు సంబంధించిన ఏర్పాట్ల పురోగతిని రోజువారీగా పర్యవేక్షించేందుకు ప్రజాభవన్‌లో ప్రత్యేక వార్‌రూమ్ ఏర్పాటు

మిగతా 2 లో

# పదేళ్లలో అప్పులే తప్ప అభివృద్ధి ఏదీ?



**అప్పును నెత్తిన పెట్టిన కేసీఆర్**

8.11 లక్షల కోట్లకు 90వేల కోట్లు వడ్డీల చెల్లింపు

మూసారాం బాగ్ బ్రిడ్జిని కూడా నిర్మించలేదు

తాము అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పరుగులు

అంబర్‌పేటలో పదెకరాల్లో ఇందిరమ్మ ఇళ్లు

అంబర్‌పేట సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్ రూ.8.11 లక్షల కోట్ల అప్పులతో తెలంగాణను దివాలా తీయించారని, కేవలం వడ్డీల రూపంలోనే ఏడాదికి రూ.90 వేల కోట్లు చెల్లించాల్సిన దుస్థితి తీసుకొచ్చారని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. మాతృభాషా దినోత్సవాల క్రమంలో మూసీ నదిపై నూతనంగా నిర్మించిన ముసారాంబాగ్ వంతెనను సోమవారం ప్రారంభించిన అనంతరం అంబర్‌పేటలో జరిగిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. 60 ఏళ్లలో 16 మంది ముఖ్యమంత్రులు కలిసి చేసిన అప్పు రూ.70 వేల కోట్లు ఉంటే, కేసీఆర్ ఒక్కరే తొమ్మిదేళ్లలో దానిని రూ.8.11 లక్షల కోట్లకు పెంచేశారని ఆరోపించారు. వర్షం వస్తే మునిగిపోయే ముసారాంబాగ్ బ్రిడ్జిని పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ఎందుకు కట్టలేకపోయిందని సీఎం ప్రశ్నించారు. ఊరి బయట డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కడితే పేదలకు ఉపయోగపడవని, అందుకే అంబర్‌పేటలోనే 10 ఎకరాల స్థలంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. చెరువులను కబ్జాల నుంచి కాపాడుతున్న 'హైడ్రా'పై ప్రతిపక్షాలు కావాలనే బురద చల్లుతున్నాయని మండిపడ్డారు.

*- హైదరాబాద్, ఆగస్టు 31*

## నర్సుపై అఘాయిత్యం.. ఆపై హత్య!





- తుక్కుగూడ కేసులో నిందితుడి అరెస్ట్
- అత్యాచారం జరిగినట్లు పోస్టుమార్టం నివేదిక
- సీసీటీవీ ఆధారాలతో సనావుల్లా గుర్తింపు

తుక్కుగూడలో నర్సు హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. యువతిపై అత్యాచారం జరిగినట్లు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. కేసులో ప్రధాన నిందితుడిగా అనుమానిస్తున్న బిహార్‌కు చెందిన సనావుల్లా ఖాన్‌ను అరెస్ట్ చేశారు.

2

## కేసీఆర్ తన పదవికి రాజీనామా చేయాలి



- వెయ్యి రోజుల్లో రూ.1.24 కోట్ల జీతభత్యాలు
- ప్రజల కోసం ఒక్కసారైనా బయటకు వచ్చారా?
- ఆరు రోజులపాటు ఆందోళనలకు సీఎం పిలుపు
- పదేళ్ల పాలనపై అసెంబ్లీలో చర్చకు సవాల్

2

ప్రధాన ప్రతిపక్ష నేత కేసీఆర్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. వెయ్యి రోజులుగా ప్రజల కోసం బయటకు రాని కేసీఆర్.. ఈ కాలంలో రూ.కోటికి పైగా జీతభత్యాలు తీసుకున్నారని ఆరోపించారు.



## జాతీయ జెండాను అవమానిస్తే మూల్యం తప్పదు

ఖలిస్థానీ వేర్పాటువాదులకు కిరణ్ రిజిజు హెచ్చరిక

.. వివరాలు 4లో

## బాణాసంచా కర్మాగారంలో పేలుడు

- పేలుడు ధాటికి 11 మంది దుర్మరణం
- యూపి సీఎం యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి


4



## మోదీ-పుతిన్ కీలక భేటీ

- వాణిజ్యం నుంచి రక్షణ వరకు విస్తృత చర్చలు
- ఎస్‌సీవో సదస్సు వేదికగా ఇరువురు నేతల సమావేశం
- ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌తోనూ భేటీ

4





## ‘ఇన్వెస్ట్ తెలంగాణ’కు గ్లోబల్ టచ్

మొదటి పేజీ తరువాయి

చేయాలని భట్టి ఆదేశించారు. వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడంతో పాటు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా వార్‌రూమ్ పని చేయాలని సూచించారు. సమ్మిట్ నిర్వహణకు అడ్వైజరీ, ఎగ్జిక్యూటివ్, ఇన్విటేషన్, హాస్పిటాలిటీ, ప్రోగ్రామ్ డిజైనింగ్, మీడియా–కాంటాక్ట్ అండ్ కమ్యూనికేషన్, ఎంఓయూ తదితర కమిటీలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రతి కమిటీకి సీనియర్ ఐఏఎస్ అధికారులను బాధ్యులుగా నియమించాలని ఆదేశించారు. అడ్వైజరీ, ఎగ్జిక్యూటివ్ కమిటీలను వీలైనంత త్వరగా ఏర్పాటు చేసి కార్యాచరణపై సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు తెలంగాణలోని అవకాశాలను సమర్థంగా వివరించేలా సమ్మిట్‌ను రూపొందించాలని భట్టి విక్రమార్క సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రధానంగా ప్రదర్శించాలన్నారు. సమ్మిట్‌కు ప్రత్యేక లోగోను రూపొందించాలని ఆదేశించారు. సమ్మిట్‌కు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృత ప్రచారం కల్పించాలని భట్టి సూచించారు. ఇందులో భాగంగా అక్టోబర్ మొదటి లేదా రెండో వారంలో ఢిల్లీలో కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. విదేశీ దౌత్యవేత్తలు, కేంద్ర మంత్రులు, దేశంలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న తెలంగాణ అధికారులు, ఇతర ప్రముఖులను ఆహ్వానించేలా ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, సామాజిక మాధ్యమాల్లో సమ్మిట్‌పై విస్తృత ప్రచారం చేపట్టడంతో పాటు హైదరాబాద్‌లోని ప్రధాన కూడళ్లు, కీలక ప్రాంతాల్లో హోర్డింగులు ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని శాఖలను సమన్వయం చేస్తూ ఏర్పాట్లపై రోజువారీ పురోగతి నివేదికను తనకు అందించాలని ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్‌ను భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రతి కమిటీకి అప్పగించిన బాధ్యతలు, వాటి అమలు, పెండింగ్ అంశాలు, తదుపరి చేపట్టాల్సిన చర్యలను నివేదికలో పొందుపరచాలన్నారు. తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా పరిచయం చేసేలా ‘ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026’ను నిర్వహించాలని, ఇందుకోసం ప్రభుత్వంలోని అన్ని శాఖలు ఒకే లక్ష్యంతో పనిచేయాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సమావేశంలో ఎనర్జీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఫ్యూచర్ సిటీ సీఎండీ శశాంక, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి.పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ విఫలమై కానిస్టేబుల్ ఆత్మహత్య



**హైదరాబాద్, ఆగస్ట్ 31:** హైదరాబాద్‌లో దారుణం జరిగింది. అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఏఆర్ కానిస్టేబుల్ నిభాష్ ఆత్మహత్య చేసుకున్నాడు. లవ్‌ఫెయిల్యూర్‌నే బలవన్మరణానికి కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ తిరుమలనగర్‌లో నివాసం ఉంటున్న నిభాష్ (25) పెట్లబుర్జులో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. అయితే ఆమె కుటుంబసభ్యులు పెళ్లికి నిరాకరించారు. దీంతో నిభాష్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలోనే రాత్రి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అంతకుముందు ఈ విషయాన్ని వాట్సాప్‌లో తన స్నేహితులకు సమాచారం అందించాడు. అయితే ఉదయం స్నేహితులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించగా.. నిభాష్ విగతజీవిగా కనిపించాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పదో తరగతి విద్యార్థి బలవన్మరణం



**హైదరాబాద్, ఆగస్ట్ 31:** మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుభాష్ చంద్రబోస్ నగర్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. చదువు సరిగా రావడం లేదనే మనస్తాపంతో 16 ఏళ్ల పదో తరగతి విద్యార్థి మల్లికార్జున్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మల్లికార్జున్ తండ్రి పెయింటింగ్ పని చేస్తూ కుమారుడిని చదివిస్తున్నాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. విద్యార్థి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన మియాపూర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు దారితీసిన పూర్తి కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కన్న బిడ్డ మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీ ఆత్మహత్య




**హైదరాబాద్, ఆగస్ట్ 31:** నగరంలోని చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీ ఆత్మహత్య కలకలం రేపుతోంది. కంది సాగర్(31) అనే రిమాండ్ ఖైదీ.. జైలు వాష్‌రూమ్‌లో ఉరి వేసుకుని బలవన్మరణానికి యత్నించాడు. వెంటనే గుర్తించిన జైలు సిబ్బంది హుటాహుటిన సాగర్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అయితే మార్గమధ్యంలోనే ఖైదీ మృతి చెందాడు. రోడ్డు ప్రమాదం కేసులో రిమాండ్‌లో ఉన్న సాగర్‌ను ఇటీవల నిజామాబాద్ జైలు నుంచి చంచల్‌గూడ జైలుకు బదిలీ చేశారు. ఈ ఘటనపై జైలు అధికారులు దర్యాప్తు చేపట్టారు. సాగర్ ఆత్మహత్యకు గల కారణాలు, ఘటనకు దారితీసిన పరిస్థితులపై అధికారులు ఆరా తీస్తున్నారు.

# పదేళ్లలో అప్పులే తప్ప అభివృద్ధి ఏదీ?

- అప్పును నెత్తిన పెట్టిన కేసీఆర్
- 8.11 లక్షల కోట్లకు 90వేల కోట్లు వడ్డీల చెల్లింపు
- మూసారాం బాగ్ బ్రిడ్జిని కూడా నిర్మించలేదు
- తాము అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పరుగులు
- అంబర్‌పేటలో పదెకరాల్లో ఇందిరమ్మ ఇళ్లు
- అంబర్‌పేట సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, ఆగస్ట్ 31:** తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ పాలనపై సీఎం రేవంత్ రెడ్డి మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. గతంలో 16 మంది ముఖ్యమంత్రులు కలిసి 60 ఏళ్లకు పైగా పాలించినా రాష్ట్ర అప్పులు రూ.70 వేల కోట్లుగా ఉండేవని, కేసీఆర్ మాత్రం తొమ్మిదేళ్ల పాలనలో అప్పులను భారీగా పెంచారని ఆరోపించారు. రూ.70 వేల కోట్ల అప్పును రూ.8.11 లక్షల కోట్లకు తీసుకెళ్లారని విమర్శించారు. ప్రస్తుతం ఆ అప్పులకు సంబంధించిన అసలు, వడ్డీ చెల్లింపుల కోసం ప్రతి నెలా భారీ మొత్తాన్ని కేటాయించాల్సి వస్తోందని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పుల కారణంగా ఏడాదికి సుమారు రూ.90 వేల కోట్లు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రం ఇలాంటి ఆర్థిక పరిస్థితుల్లో ఉన్న సమయంలోనే డిసెంబర్ 7న ప్రభుత్వం తమ చేతుల్లోకి వచ్చిందని తెలిపారు. గత ప్రభుత్వం తమపై భారీగా ఆర్థిక భారాన్ని మోపి వెళ్లిందని విమర్శించారు. రాష్ట్రాన్ని మూడు విభాగాలుగా విభజించి అభివృద్ధి చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రణాళికబద్ధంగా రాష్ట్రంలో మౌలిక వసతులు అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. మూసీ నదిపై మూసారాంబాగ్‌లో నిర్మించిన కొత్త వంతెనను ముఖ్యమంత్రి ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో సీఎం మాట్లాడారు. అంబర్‌పేటలో ఏ కార్యాలయాలూ లేవు. పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. కొంచెం వర్షం వస్తే మూసారాంబాగ్ బ్రిడ్జి మునిగేది. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎందుకు బ్రిడ్జి కట్టలేకపోయిందన్నారు. కానీ తాము రెండేళ్లలోనే వంతెనను పూర్తి చేశాం. ఊరి బయట పది కిలోమీటర్ల అవతల డబుల్ బెడ్ రూంలు కడితే ఇక్కడ ఉన్న వాళ్లకు అవి ఎలా ఉపయోగపడతాయి? అంబర్‌పేటలో 10 ఎకరాల్లో ఇందిరమ్మ ఇళ్లు కట్టించాలని నిర్ణయం తీసుకున్నాం. ఈ ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాలు కట్టాలని కంకణం కట్టుకున్నాం. బతుకమ్మ కుంటను కబ్జా చేయడానికి ప్రయత్నం చేసింది ఎవరో తెలియదా? ఈరోజు బతుకమ్మ కుంట పేదలకు అంకితం అయింది. విమానం నుంచి పూలు చల్లిన ఎడ్ల సుధాకర్.. మళ్లీ బతుకమ్మ కుంటను ఆక్రమించాలని చూస్తున్నారు. ఆయన వెనుక ఉన్నదెవరో ఆలోచించాలన్నారు. హైడ్రాపై, నాపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయి. కబ్జాలు ఎవరు చేస్తున్నారో ప్రజలు ఆలోచించాలి. 2023 డిసెంబర్ 7న మీ ఆశీర్వాదం వల్ల ఇందిరమ్మ రాజ్యం, ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాయి. ప్రజా ప్రభుత్వం వచ్చి 1000 రోజులు పూర్తయింది. రేవంత్ రెడ్డిపై బురద చల్లడానికి కొన్ని అల్లరి మూకలు బయల్దేరాయి. చెరువుల్లో ఆక్రమణలు తొలగిస్తున్నామే తప్ప వాటిలో విల్లాలు, ఫామ్‌హౌస్‌లు మేం కట్టలేదని ఎద్దేవా చేశారు. మేం అధికారంలోకి వచ్చే నాటికి ఆర్థిక పరిస్థితి దివాలా తీసింది. ఏడో తేదీ వచ్చినా జీతాలు ఇవ్వలేని పరిస్థితి. రూ.70 వేల కోట్ల అప్పును.. 9 ఏళ్లలో రూ.8.11 లక్షల కోట్లకు చేర్చారు. 16 మంది సీఎంలు చేసిన అప్పు రూ.70 వేల కోట్లు. కేసీఆర్ ఒక్కరే రూ.8 లక్షల కోట్ల అప్పు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు మధ్య మధ్యలో నన్ను బెదిరిస్తున్నారు. మేం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక్కసారైనా ఒకటో తేదీనా జీతాలు ఇవ్వకుండా ఉన్నామా? ఆనాడు పరిపాలన ఎలా ఉందో.. నేడు ఏవిధంగా ఉందో ప్రభుత్వ ఉద్యోగులు ఆలోచించాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై కూడా రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రిటైర్మెంట్ బకాయిల రూపంలో రూ.6 వేల కోట్లను వంద రోజుల్లో చెల్లించామని తెలిపారు. కేసీఆర్ హయాంలో నిలిచిపోయిన పీఆర్సీని తమ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు కార్పొరేట్ వైద్యం అందించే ఆరోగ్య భద్రత కార్డులను పునరుద్ధరించామని చెప్పారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం విషయంలోనూ తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని రేవంత్ తెలిపారు. 32 నెలల్లో ఆర్టీసీకి రూ.11 వేల కోట్లు చెల్లించామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నప్పటికీ ఆర్టీసీకి ఆర్థిక నష్టం రాకుండా ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తోందని వివరించారు. గతంలో ఆర్టీసీ కార్మికులు చనిపోయినా పట్టించుకోలేదని కేసీఆర్‌పై విమర్శలు చేశారు. 2024 జనవరి 1 నుంచి ఇప్పటివరకు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నామని సీఎం అన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు గతంలో ఆరు నెలల పాటు జీతాలు ఆలస్యమయ్యేవని, ఇప్పుడు ఐదో తేదీకే జీతాలు అందుతున్నాయని పేర్కొన్నారు. రిటైర్మెంట్ వయసు పెంపు, రూ.8 వేల కోట్ల బకాయిల భారాన్ని కూడా గత ప్రభుత్వం తమపై వదిలి వెళ్లిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఉద్యోగులు గత పరిస్థితులు, ప్రస్తుత పరిస్థితులను పోల్చి చూడాలని సూచించారు.

# కేసీఆర్ తన పదవికి రాజీనామా చేయాలి



- వెయ్యి రోజుల్లో రూ.1.24 కోట్ల జీతభత్యాలు
- ప్రజల కోసం ఒక్కసారైనా బయటకు వచ్చారా?
- ఆరు రోజులపాటు ఆందోళనలకు సీఎం పిలుపు
- పదేళ్ల పాలనపై అసెంబ్లీలో చర్చకు సవాల్

**హైదరాబాద్, ఆగస్ట్ 31:** కేసీఆర్ 1000 రోజుల్లో కోటి 24 లక్షల 40 వేల రూపాయలు జీతం తీసుకున్నారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి 365 రోజులు ఉద్యోగానికి హాజరు కాకపోతే డిస్మిస్ చేస్తారు. మరి కేసీఆర్‌ను ఏం చేయాలి. ప్రతిపక్ష నాయకుడి హోదా ఉన్నందుకు ఆయనకు ఇన్నిరోజులు సెక్యూరిటీ, ఇల్లు, బు÷–లలెట్ ప్రూఫ్ వాహనాలు తదితర వసతుల కోసం ప్రభుత్వం రూ.21 కోట్లు ఖర్చు చేసింది. కేసీఆర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి. ఆయన రాజీనామా కోరుతూ ప్రజలు ఊరూరా ఆందోళనలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. అంబర్‌పేట సభలో సిఎం మాట్లాడుతూ కేసీఆర్‌కు.. నాకు పోలిక ఏంటి..? కేసీఆర్ సీఎం అయితే ఆయన కుటుంబ సభ్యులు, బంధువులకు పదవులు కట్టబెట్టారు. నేను సీఎం అయ్యాక ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పదవులు ఇచ్చాం. దేశంలోనే ప్రధాన ప్రతిపక్ష నేత వైఫల్యం చెందిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. పదేళ్లలో మీరు ఏం చేశారో.. రెండున్నరేళ్లలో.. మేం ఏం చేశామో అసెంబ్లీలో చర్చకు సిద్ధం. ఈ వెయ్యి రోజుల్లో జనం కోసం కేసీఆర్ ఒక్కసారైనా బయటకు వచ్చారా? ఈ వెయ్యి రోజుల్లో ప్రధాన ప్రతిపక్ష నేత రూ.22.24 కోట్ల ప్రభుత్వ వేతనం తీసుకున్నారు. రేపటి నుంచి 6 రోజులపాటు ప్రధాన ప్రతిపక్ష నేత రాజీనామా చేయాలంటూ ఆందోళనలు చేయాలి.’ అని ప్రతిపక్ష నేతపై సీఎం రేవంత్ ఘాటైన విమర్శలు చేశారు. ఉస్మానియా ఆసుపత్రిని 2 వేల పడకలతో కడుతున్నాం. వచ్చే ఏడాదిలో ప్రారంభిస్తాం. సనత్‌నగర్ టిమ్స్‌కు మర్రిచెన్నారెడ్డి పేరు, అల్వాల్‌లో ఉన్న టిమ్స్‌కు టి.అంజయ్య పేరు, ఎల్బీనగర్ టిమ్స్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు, వరంగల్‌లో ఉన్న టిమ్స్‌కు ప్రొ.జయశంకర్ పేరు పెడతాం. బ్రిటిష్ హయాంలో 1931లో కులగణన చేస్తే.. 100 ఏళ్లలో మళ్లీ కులగణన చేసేందుకు ఈ దేశంలో ఏ నాయకుడు ధైర్యం చేయలేదు. జనగణన, కులగణన చేస్తారా లేదా గద్దె దిగుతారా అని తెలంగాణ సమాజం ప్రధాని మోదీకి సవాల్ విసిరిందన్నారు.

## వచ్చే మార్చి నాటికి లక్ష ఉద్యోగాల భర్తీ

### రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి వెల్లడి




**మహబూబాబాద్, ఆగస్ట్ 31:** వచ్చే మార్చి నాటికి రాష్ట్రంలో లక్ష ఉద్యోగాలను భర్తీ చేస్తామని రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి ప్రకటించారు. అలాగే వారానికి ఒక ఉద్యోగ నోటిఫికేషన్ విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని వేం నరేందర్ రెడ్డి తెలిపారు. తమ ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ విషయంలో ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. ఉద్యోగాల భర్తీకి సంబంధించి నిరుద్యోగులకు వరుసగా అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. మానుకోటలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ ఉద్యోగాల ఉచిత శిక్షణ శిబిరంలో రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. వచ్చే డిసెంబర్‌లో మరోసారి పోలీస్ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఆయన ప్రకటించారు. పోలీస్ ఉద్యోగాల భర్తీని మూడు విడతల్లో చేపట్టనున్నట్లు తెలిపారు. పోలీస్ శాఖలో ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తమ ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజలకు వివరించడంలో వెనుకంజలో ఉందని వేం నరేందర్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో తమవాళ్లు కొంత వెనుకబడ్డారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగ నియామక పరీక్షలకు సంబంధించిన అనేక ప్రశ్నపత్రాల లీకేజీలు జరిగాయని ఆయన గుర్తు చేశారు. చివరకు జిరాక్స్ సెంటర్లలో కూడా ప్రశ్నపత్రాలు లభించే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ప్రస్తుతం ఉద్యోగ నియామక ప్రక్రియలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

# నర్సుపై అఘాయిత్యం.. ఆపై హత్య!

### తుక్కుగూడ కేసులో నిందితుడి అరెస్ట్
### అత్యాచారం జరిగినట్లు పోస్టుమార్టం నివేదిక
### సీసీటీవీ ఆధారాలతో సనావుల్లా గుర్తింపు
### కిటికీ మార్గంలో హాస్టల్‌లోకి ప్రవేశించినట్లు పోలీసుల నిర్ధారణ



**హైదరాబాద్, ఆగస్టు 31:** తుక్కుగూడలో నర్సు హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. యువతిపై అత్యాచారం జరిగినట్లు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. కేసులో ప్రధాన నిందితుడిగా అనుమానిస్తున్న బిహార్‌కు చెందిన సనావుల్లా ఖాన్‌ను అరెస్ట్ చేశారు. విచారణలో అతడు నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా అత్యాచారానికి సంబంధించిన సెక్షన్లను కూడా కేసులో చేర్చేందుకు చర్యలు చేపట్టారు. తుక్కుగూడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న యువతి శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. రాఖీ పండుగ సందర్భంగా తోటి నర్సులు స్వగ్రామాలకు వెళ్లడంతో ఆమె హాస్టల్‌లో ఒంటరిగా ఉన్న సమయంలో ఈ ఘటన జరిగినట్లు పోలీసులు గుర్తించారు. పహాడీషరీఫ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆసుపత్రి సమీపంలోని కార్ల మెకానిక్ షాపులో పనిచేస్తున్న సనావుల్లాపై అనుమానం రావడంతో పోలీసులు అతడి కదలికలపై దృష్టి సారించారు. యువతి ఉంటున్న గది కిటికీకి గ్రిల్స్ లేకపోవడంతో అదే మార్గంలో నిందితుడు లోపలికి ప్రవేశించినట్లు దర్యాప్తులో గుర్తించారు. యువతిపై లైంగిక దాడికి పాల్పడగా ఆమె ప్రతిఘటించడంతో గొంతు నులిమి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. హత్య అనంతరం అక్కడి నుంచి తప్పించుకునేందుకు నిందితుడు ప్రయత్నించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో మెకానిక్ షాపు యజమానికి ఫోన్ చేసి పెట్రోల్ కావాలని అడిగినట్లు విచారణలో గుర్తించారు. మరోవైపు యువతి మృతదేహం బయటపడిన తర్వాత పోలీసులు ఘటనాస్థలంలో దర్యాప్తు చేపట్టిన సమయంలో సనావుల్లా అక్కడే ఉన్నట్లు గుర్తించారు. ఏం జరిగిందంటూ పోలీసులను ప్రశ్నిస్తూ అనుమానం రాకుండా వ్యవహరించినట్లు సమాచారం. అయితే డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టగా జాగిలం మెకానిక్ షాపు వద్దకు వెళ్లి ఆగడంతో పోలీసులకు అనుమానం బలపడింది. దీంతో సనావుల్లాను అదుపులోకి తీసుకుని విచారించారు. సీసీటీవీ దృశ్యాలు, ఇతర ఆధారాలను పరిశీలించిన అనంతరం ప్రశ్నించగా నేరాన్ని అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనలో మరెవరైనా ప్రమేయం ఉందా? నేరానికి ముందస్తు ప్రణాళిక ఏమైనా ఉందా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ధరణి కన్నా దరిద్రంగా 'భూభారతి'!

- 22ఏతో 50 లక్షల మందికి ఇబ్బందులు: బీజేపీ
- నిషేధిత జాబితాపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- స్వతంత్ర సంస్థతో విచారణకు రామచందర్‌రావు డిమాండ్
- సెప్టెంబర్ 7లోగా పరిష్కరించకుంటే అసెంబ్లీ ముట్టడి: రఘునందన్



**సిద్ధిపేట, ఆగస్టు 31:** బీఆర్ఎస్ హయాంలో తీసుకొచ్చిన ధరణి కంటే కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి మరింత దారుణంగా తయారైందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు విమర్శించారు. 22ఏ నిషేధిత జాబితాతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 50 లక్షల మంది ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. 22ఏ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిద్ధిపేట ఆర్డీవో కార్యాలయం ఎదుట బీజేపీ నిర్వహించిన మహాధర్నాలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామచందర్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వ అర్థంలేని విధానాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. తప్పు జరిగిందని ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి అంగీకరించినప్పటికీ దానిని సరిదిద్దడం లేదని విమర్శించారు. "నాడు బీఆర్ఎస్.. నేడు కాంగ్రెస్. టైటిల్ మారింది తప్ప దోపిడీ విధానాలు మారలేదు" అని ఎద్దేవా చేశారు. ఒక సర్వే నంబర్‌లో కేవలం రెండు ప్లాట్లకు సమస్య ఉంటే వేలాది ప్లాట్లను నిషేధిత జాబితాలో చేర్చారని రామచందర్‌రావు ఆరోపించారు. అదే సర్వే నంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇల్లు కూడా ఉందని, అది మాత్రం 22ఏ జాబితా నుంచి ఎలా బయటకు వచ్చిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 30 శాతం కమిషన్‌తో నడుస్తోందని ఆరోపించిన ఆయన.. పేదల భూములను ప్రభుత్వం తీసుకుని విక్రయిస్తోందని విమర్శించారు. తమ భూములను కాపాడాలంటూ పేద రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారని పేర్కొన్నారు. 22ఏ నిషేధిత జాబితాపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయడంతో పాటు స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రైతుల కోసం బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని, అవసరమైతే జైలుకెళ్లేందుకూ సిద్ధమని ప్రకటించారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యేలోగా 22ఏ సమస్యపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులు, పేదలకు న్యాయం జరుగుతుందని చెప్పారని, కానీ ఇప్పుడు వారి పరిస్థితి "పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లు" తయారైందని విమర్శించారు. తప్పులను సరిచేస్తామని చెప్పిన ప్రభుత్వం.. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. భూభారతి వస్తే రైతుల కష్టాలు తీరుతాయని చెప్పారని, కానీ ఇప్పుడు రైతులు తమ భూముల సమస్యల పరిష్కారం కోసం తహశీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇల్లు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి సంబంధించిన భూములు కూడా 22ఏ పరిధిలోకి వచ్చాయని పేర్కొంటూ.. వాటి తొలగింపునకు సంబంధించిన దరఖాస్తులను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. వారి ఆస్తులు 22ఏ నుంచి బయటకు వస్తే రైతుల భూములను ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నించారు. సిద్ధిపేట జిల్లాలో భూములు ఎవరికి తెలియకుండా మాయమవుతున్నాయని రఘునందన్‌రావు ఆరోపించారు. వివిధ అవసరాలు, ప్రాజెక్టుల పేరుతో భూములు తీసుకుంటున్నారని విమర్శించారు. భూముల విక్రయాలతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. సెప్టెంబర్ 7లోగా 22ఏ సమస్యపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని రఘునందన్‌రావు హెచ్చరించారు. రైతుల భూములను నిషేధిత జాబితాలో పెట్టిన కాంగ్రెస్‌ను ప్రజలే రాజకీయంగా నిషేధించాలని పిలుపునిచ్చారు.



# రైల్వేల అభివృద్ధికి చర్యలు

## మహబూబ్‌నగర్‌లో ఆధునీకరణ పనులు పరిశీలించిన కిషన్ రెడ్డి

**మహబూబ్‌నగర్,ఆగస్ట్31 :** తెలంగాణ రాష్ట్రంలోని రైల్వేల అభివృద్ధికి అంకితభావంతో తాము పనిచేస్తున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కొత్త రైల్వే ట్రాక్‌లు, వాటిని ఉన్నతీకరణ చేసే విధంగా పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఆధునికీకరణ పనులు కొనసాగుతున్న రైల్వేస్టేషన్ పనులను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణసోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్‌ను రైల్వేహాబ్‌గా మారుస్తున్నామని వెల్లడించారు. 5 వందేభారత్ రైళ్లను కేందప్రభుత్వం తెలంగాణకు ఇచ్చిందని ప్రస్తావించారు. మోదీ హయాంలోని పదేళ్లలో 100 కొత్త రైళ్లను తెలంగాణలో అందుబాటులోకి తీసుకువచ్చామని వెల్లడించారు. తెలంగాణలో 42 రైల్వేస్టేషన్లను ఏకకాలంలో అభివృద్ధి చేస్తున్నామని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మౌలిక వసతులకు పెద్దపీట వేస్తున్నామని చెప్పుకొచ్చారు. 2014కు ముందు రైల్వేస్టేషన్లు అధ్వానంగా ఉండేవని.. కానీ నేడు మోదీ హయాంలో పరిస్థితి మారిందని తెలిపారు. ప్రయాణికులు భాగస్వాములైతే స్వచ్ఛస్టేషన్లు సాధ్యమవుతాయని వివరించారు. రైల్వేస్టేషన్లు ఏయిర్-పోర్టు స్థాయిలో ఉండాలన్నదే ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్ష్యమని ఉద్ఘాటించారు. 2014కు ముందు ఉమ్మడి రాష్ట్రంలో రూ.886 కోట్ల రైల్వే బడ్జెట్ ఉంటే 2026-27 బడ్జెట్లో తెలంగాణకే రూ.5454 కోట్లను కేంద్రం కేటాయించిందని కిషన్‌రెడ్డి తెలిపారు. స్వాతంత్యం÷-ర వచ్చినప్పటి నుంచి తెలంగాణలో రైల్వే రంగం నిర్లక్ష్యానికి గురైందని అన్నారు. దేశంలో 7 బు÷-లలెట్ ట్రైన్స్ ప్రవేశపెడితే.. తెలంగాణకు మూడు ఇచ్చామని.. ఇది రైల్వేరంగంలో సువర్ణాధ్యాయమని నొక్కిచెప్పారు. రూ.5 లక్షల కోట్లతో బు÷-లలెట్ ట్రైన్స్ అందుబాటులోకి తీసుకువస్తున్నామని స్పష్టం చేశారు. ప్రమాదాలు జరగకుండా దేశంలోనే తొలిసారిగా కవచ్ ప్రాజెక్ట్‌ను తెలంగాణలో ప్రయోగాత్మకంగా అమలు చేయబోతున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# తెలంగాణ కోసం కష్టపడ్డ నన్నే గెంటేశారు!

## ప్రశాంత్‌రెడ్డి 'శకుని' పాత్ర పోషించారు: కవిత

## జీవితంలో ఆయనను మాత్రం క్షమించనని వ్యాఖ్య

## కేసీఆర్‌తో తనను విడదీశారని తీవ్ర ఆరోపణ

## కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నించారని విమర్శ

## నిజామాబాద్ పాంచజన్య సభలో భావోద్వేగం






**నిజామాబాద్, ఆగస్టు 31:** తెలంగాణ ఉద్యమం కోసం, పార్టీని అధికారంలోకి తీసుకురావడం కోసం ఎంతో కష్టపడిన తననే చివరకు అన్యాయంగా బయటకు గెంటేశారని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తండ్రి కేసీఆర్‌కు తనను దూరం చేయడంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి కీలక పాత్ర పోషించారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన మహాభారతంలోని 'శకుని' పాత్ర పోషించారని మండిపడ్డారు. జీవితంలో హరీశ్‌రావునో, సంతోష్‌రావునో క్షమిస్తానేమో కానీ ప్రశాంత్‌రెడ్డిని మాత్రం క్షమించబోనని వ్యాఖ్యానించారు. నిజామాబాద్‌లో నిర్వహించిన 'పాంచజన్య' సభలో కవిత ప్రసంగిస్తూ పలుమార్లు భావోద్వేగానికి గురయ్యారు. "తెలంగాణ కోసం కష్టపడ్డాను. పార్టీ అధికారంలోకి రావడానికి పనిచేశాను. చివరకు అదే పార్టీలో నాకు స్థానం లేకుండా చేశారు. నేను ఏం తప్పు చేశానని తిహార్ జైలులో పెట్టారు? కష్టాల్లో ఉన్న సమయంలో కనికరం కూడా చూపకుండా పార్టీ నుంచి వెళ్లగొట్టారు" అంటూ కంటతడి పెట్టారు.

### 'ప్రశాంత్‌ను మాత్రం క్షమించను'

"హరీశ్‌రావునో, సంతోష్‌రావునో క్షమిస్తానేమో.. ప్రశాంత్‌రెడ్డిని మాత్రం జీవితంలో క్షమించను. ఆయనకు నా ఉసురు తగులుతుంది. కేసీఆర్ ఆయనను కుమారుడిలా చూసుకుంటే మా మధ్య చిచ్చుపెట్టారు" అని కవిత ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయిన రెండో రోజే ప్రశాంత్‌రెడ్డి కాంగ్రెస్ నేతలతో సంప్రదింపులు జరిపారని కవిత ఆరోపించారు. కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారని, అమెరికాలో ఉన్న సమయంలోనూ వేం నరేందర్‌రెడ్డితో సంప్రదింపులు జరిపారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలకు సంబంధించి ప్రశాంత్‌రెడ్డి స్పందనను ఆమె ప్రస్తావించలేదు. ప్రశాంత్‌రెడ్డి మంత్రి కావడానికి తాను ఎంతో ప్రయత్నించానని కవిత చెప్పారు. ప్రశాంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి సహా నిజామాబాద్ జిల్లాలో పలువురు నేతల విజయానికి కష్టపడ్డానని, చివరకు వారే తన రాజకీయ ఓటమికి కారణమయ్యారని ఆరోపించారు.

### 'కన్నీళ్లు చూసి పిరికిదాన్ని అనుకోవద్దు'

"ఈ గడ్డ బిడ్డగా మిమ్మల్ని చూడగానే భావోద్వేగంతో కన్నీళ్లు ఆగడం లేదు. కన్నీళ్లు పెట్టుకున్నానని పిరికిదాన్ని అనుకోవద్దు. నిజాయితీగా ఉన్నాను కాబట్టే బాధ కలుగుతోంది" అని కవిత పేర్కొన్నారు. తాను జైలులో ఉన్న సమయంలో తన అత్త అండగా నిలిచారని గుర్తుచేసుకున్నారు. తనపై నమోదైన కేసులను ప్రస్తావిస్తూ.. ఈడీ, సీబీఐ కేసులతో కొన్నేళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొన్నానని చెప్పారు. ఎన్ని కేసులు పెట్టినా తాను తప్పు చేయలేదనే చెబుతూ వచ్చానన్నారు. రాజకీయ పదవుల కోసం తెలంగాణ రక్షణ సేనను ఏర్పాటు చేయలేదని, ప్రజల కోసం పనిచేయాలన్నదే తన లక్ష్యమని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపైనా కవిత విమర్శలు చేశారు. ప్రాజెక్టుకు భారీగా నిధులు ఖర్చు చేసినా నిజామాబాద్ జిల్లాకు ఆశించిన ప్రయోజనం దక్కలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో అవినీతి జరిగిందని, అప్పటి కొందరు ఎమ్మెల్యేల ఆస్తులు పదేళ్లలో భారీగా పెరిగాయని వ్యాఖ్యానించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపైనా కవిత విమర్శలు గుప్పించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని, ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన ప్రధాన ప్రతిపక్షం కూడా తన బాధ్యతను సమర్థంగా నిర్వర్తించడం లేదని అన్నారు. "నిజామాబాద్ కోడలిగా ఇక్కడ పనిచేశాను. నాకు మరో అవకాశం ఇవ్వండి. మీరే నా ధైర్యం" అని కవిత ప్రజలను కోరారు. రాజకీయాలే లక్ష్యమైతే తాను ఏ పార్టీలోకైనా వెళ్లగలనని, ప్రజల కోసం పనిచేయాలన్న ఉద్దేశంతోనే కొత్త రాజకీయ ప్రయాణాన్ని ఎంచుకున్నానని చెప్పారు. నిజామాబాద్ జిల్లాలో ఐదు స్థానాల్లో తెలంగాణ రక్షణ సేన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని ప్రకటించారు. సామాజిక న్యాయమే లక్ష్యంగా ముందుకు వెళ్తామని, అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీ వ్యవహారంపైనా కవిత ఆరోపణలు చేశారు. మాజీ మంత్రి కేటీఆర్‌కు సన్నిహితుడైన కోరుట్ల ఎమ్మెల్యే దానిని కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌పైనా విమర్శలు చేస్తూ.. మాధవనగర్ రైల్వే బ్రిడ్జిని ఇప్పటికీ ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. అర్వింద్ కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని కూడా ఆరోపించారు. అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ప్రజా సమస్యలపై విఫలమయ్యాయని పేర్కొన్న కవిత.. తెలంగాణ రాజకీయాల్లో కొత్త శక్తి రావాల్సిన అవసరం ఉందని, ప్రజలు తమకు అవకాశం ఇవ్వాలని కోరారు.

# యూత్ కాంగ్రెస్ నేతల దాడి హేయం

## బిజెపి కార్యాలయం రక్షణపై పోలీసుల నిర్లక్ష్యం

## మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్



**హైదరాబాద్,ఆగస్ట్31 :** హైదరాబాద్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయం వద్ద యూత్ కాంగ్రెస్ నేతలు వ్యవహరించిన తీరుపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ కార్యాలయం వద్ద ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దగ్ధం చేసి, ఆ పార్టీ కార్యాలయ గేటుకు నల్ల రంగు పూస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇంటెలిజెన్స్ వ్యవస్థ పనిచేస్తోందా? అని నిలదీశారు. పట్టపగలు బీజేపీ ఆఫీస్‌పై దాడి చేస్తుంటే పోలీసులు తమాషా చూస్తున్నారా? అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌కు తొత్తులుగా పోలీసులు పనిచేస్తున్నారా? అని బండి సంజయ్ మండిపడ్డారు. భాగ్యనగరం నడిబొడ్డున ఉన్న జాతీయ పార్టీ రాష్ట్ర కార్యాలయానికి రక్షణ కల్పించే బాధ్యత మీకు లేదా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. యూత్ కాంగ్రెస్ నేతలు అరాచకం సృష్టిస్తోంటే అక్కడ పోలీసులెందుకు లేరు? అని నిలదీశారు. పోలీసుల వైఫల్యానికి మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. తమ సహనాన్ని చేతగానితనంగా భావిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. ఖబడ్దార్ కాంగ్రెస్ నేతల్లారా.... తాము తలుచుకుంటే బయట తిరగలేరని బండి సంజయ్ హెచ్చరించారు. ఈ ఘటనకు కారణమైన వారిని అరెస్ట్ చేసి చట్టం ముందు సాయంత్రంలోపు నిలబెట్టాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో యూత్ కాంగ్రెస్ నేతల చర్యకు మించి ప్రతి చర్యలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. బీజేవైఎం కార్యకర్తలు తలుచుకుంటే యూత్ కాంగ్రెస్ నేతలు బయట తిరగలేరని మందలించారు. ఈ ఘటనపై కాంగ్రెస్ నాయకత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే కాంగ్రెస్ కార్యాలయాలను బీజేపీ శ్రేణులు దిగ్బంధిస్తారని హెచ్చరించారు. జరగబోయే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. యూత్ కాంగ్రెస్ నేతలు బీజేపీ ఆఫీస్‌పై చేసిన దాడిపై తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులకు కేంద్రమంత్రి బండి సంజయ్ ఫోన్ చేసి ఆరా తీశారు. బీజేపీ ఆఫీస్ వద్ద ప్రధాని దిష్టిబొమ్మ దగ్ధం చేసి, కార్యాలయ గేటుకు నల్ల రంగు పూస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారన్ని ÷ర్ అయ్యారు. పట్టపగలు బీజేపీ ఆఫీస్‌పై దాడి చేస్తుంటే ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఏం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులను వివరణ కోరారు. తక్షణమే ఈ ఘటనకు బాధ్యులైన వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# కృష్ణా జలాలు తరలిపోతుంటే చోద్యమా?

## వెలిగొండపై హరీశ్‌రావు ఆగ్రహం


## తెలంగాణకు తీరని ద్రోహమని విమర్శ

## కృష్ణా బేసిన్ ప్రాజెక్టులు ఎండుతున్నాయని ఆవేదన

## కేఆర్ఎంబీ ప్రేక్షకపాత్రపై మండిపాటు

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పందించాలని డిమాండ్

**హైదరాబాద్, ఆగస్టు 31:** తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ తరలించుకుపోతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఇంకెప్పుడు మేల్కొంటుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ప్రశ్నించారు. నీటి కేటాయింపులు లేకున్నా, వరద జలాలు రాకున్నా వెలిగొండ ప్రాజెక్టు ద్వారా బేసిన్ దాటి కృష్ణా జలాలను ఏపీ తరలిస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. ఇది తెలంగాణ ప్రయోజనాలకు తీరని ద్రోహమని విమర్శించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో సాగునీటి కష్టాలు తీవ్రమవుతుంటే.. మరోవైపు ఏపీ ప్రభుత్వం తెలంగాణ నీటి హక్కులను దెబ్బతీసేలా కృష్ణా జలాలను తరలిస్తోందని హరీశ్‌రావు ఆరోపించారు. కృష్ణా బేసిన్‌లోని భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు నీరు లేక ఆయకట్టు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే.. బేసిన్‌తో సంబంధం లేని ప్రాంతాలకు నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలిస్తున్నారని పేర్కొన్నారు. మాల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు, నాగార్జునసాగర్ కుడి కాల్వల ద్వారా ఇప్పటికే నీటిని తరలిస్తున్నారని, ఇప్పుడు వెలిగొండ కూడా ఆ జాబితాలో చేరిందని విమర్శించారు. "తెలంగాణ వాటా నీటిని ఏపీ తరలిస్తున్నా రేవంత్ ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదు? రంగారెడ్డి, పాలమూరు, నల్లగొండ సహా తెలంగాణ రైతులకు చేస్తున్న తీరని ద్రోహం ఇది" అని హరీశ్‌రావు ఆరోపించారు. తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా జలాలను రాష్ట్రంలోని పొలాలకు మళ్లించాల్సిన ప్రభుత్వం.. ఏపీకి పరోక్షంగా ఎందుకు సహకరిస్తోందని ప్రశ్నించారు. ప్రాజెక్టుల నిర్వహణ, నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సైతం పట్టనట్లు వ్యవహరిస్తోందని విమర్శించారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన సంస్థే ప్రేక్షకపాత్ర పోషిస్తే రాష్ట్ర నీటి హక్కులను ఎవరు కాపాడతారని నిలదీశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెంటనే



స్పందించి కృష్ణా నదీ యాజమాన్య బోర్డుపై ఒత్తిడి తీసుకురావాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను నింపడంతో పాటు ఆయకట్టుకు నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

# ఆడబిడ్డల భద్రత ప్రశ్నార్థకం!

## తుక్కుగూడ ఘటనే నిదర్శనం: హరీశ్‌రావు

## సీఎం ఏం చేస్తున్నారని ప్రశ్న.. సమగ్ర దర్యాప్తునకు డిమాండ్

## మహిళల రక్షణకు కఠిన చర్యలు చేపట్టాలి

**హైదరాబాద్, ఆగస్టు 31:** తెలంగాణలో ఆడబిడ్డల భద్రత ప్రశ్నార్థకంగా మారడం సిగ్గుచేటని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. తుక్కుగూడలో నర్సు హత్య ఘటనపై సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజల ఆస్తులకే కాకుండా ప్రాణాలకు కూడా భద్రత లేకుండా పోయిందని ఆరోపించారు. గురుకులంలో చదివి, పేదరికాన్ని అధిగమించి నర్సుగా సేవలందిస్తున్న యువతి హత్యకు గురికావడం తీవ్రంగా కలచివేసిందని హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆమెపై లైంగిక దాడి జరిగినట్లు వెలుగులోకి వచ్చిన అంశాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత శాంతిభద్రతలు క్షీణించాయని హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలపై నేరాలు జరుగుతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. "ఇంకెంత మంది ఆడబిడ్డలు బలైతే ప్రభుత్వం మేల్కొంటుంది? మహిళలకు భద్రత కల్పించలేని పరిస్థితి ఎందుకు వచ్చింది?" అని నిలదీశారు. తుక్కుగూడ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, నేరం రుజువైతే నిందితుడికి చట్టప్రకారం త్వరితగతిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళల భద్రతను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు.

## సంపాదకీయం



# హిమాలయాల్లో వాటర్ బాంబ్స్!

**మంచుకొండల్లో పొంచి ఉన్న జలప్రళయం**

**భారత్‌లోనే 7,500 హిమానీనద సరస్సులు**

**200 వరకు అధిక ముప్పు జాబితాలో**

**గంగా పరీవాహకంలోనే 4,700కు పైగా సరస్సులు**

**ముందస్తు హెచ్చరిక వ్యవస్థలే రక్షణ కవచం**

పైకి ప్రశాంతంగా కనిపించే మంచుకొండలు.. వాటి మధ్య నిశ్శబ్దంగా పేరుకుపోతున్న అపార జలరాశి.. సహజ అడ్డుకట్ట ఒక్కసారి తెగిందంటే క్షణాల్లోనే దిగువ ప్రాంతాలపై విరుచుకుపడే జలప్రళయం! హిమాలయాల్లోని కొన్ని హిమానీనద సరస్సులు ఇప్పుడు ఇలాంటి ప్రమాదాన్నే మోస్తున్నాయి. అందుకే నిపుణులు వాటిని 'వాటర్ బాంబ్స్'గా అభివర్ణిస్తున్నారు. నేపాల్‌లో సంభవించిన భారీ వరదల నేపథ్యంలో భారత హిమాలయ ప్రాంతాల్లోని హిమానీనద సరస్సుల భద్రత మరోసారి చర్చకు వచ్చింది. హిమానీనదాలు కరిగే క్రమంలో ఏర్పడే సరస్సుల్లో భారీగా నీరు చేరుతుంది. మంచు, రాళ్లు, మట్టితో ఏర్పడిన సహజ అడ్డుకట్టలు ఆ నీటిని నిలువరిస్తుంటాయి. భారీ వర్షాలు, వేగంగా మంచు కరగడం, కొండచరియలు విరిగిపడటం లేదా భూకంపాల కారణంగా ఈ అడ్డుకట్టలు బలహీనపడి ఒక్కసారిగా తెగిపోతే.. అపారమైన నీటితో పాటు బురద, రాళ్లు దిగువకు దూసుకొస్తాయి. దీనినే హిమానీనద సరస్సు విస్ఫోట వరదగా పేర్కొంటారు. సాధారణ వరదలతో పోలిస్తే ఇలాంటి విపత్తుల్లో ముందస్తుగా స్పందించేందుకు సమయం చాలా తక్కువగా ఉండొచ్చు. ఎత్తైన ప్రాంతం నుంచి భారీ వేగంతో వచ్చే నీరు, రాళ్లు, బురద మార్గంలోని రహదారులు, వంతెనలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు, నివాస ప్రాంతాలను తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉంటుంది. నేపాల్–టిబెట్ సరిహద్దు ప్రాంతంలో ఇటీవల సంభవించిన భారీ వరదలు ఈ ప్రమాదంపై మరోసారి హెచ్చరికలు పంపాయి. భోటేకోశి, త్రిశూలి నదుల్లో వరద ప్రవాహం పెరగడంతో మధ్య నేపాల్‌లోని పలు ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమైనట్లు నివేదికలు పేర్కొన్నాయి. టిబెట్‌లోని నదీ మూల ప్రాంతాల సమీపంలో పరిస్థితులను కూడా అధికారులు నిశితంగా గమనిస్తున్నారు. జాతీయ విపత్తు నిర్వహణ వ్యవస్థకు చెందిన అధికారుల అంచనాల ప్రకారం భారత హిమాలయ ప్రాంతంలోని 11 నదీ పరీవాహక ప్రాంతాల్లో సుమారు 28 వేల హిమానీనద సరస్సులు ఉన్నట్లు సమాచారం. వాటిలో దాదాపు 7,500 సరస్సులు భారత భూభాగంలోనే ఉన్నట్లు అంచనా. ఒక్క గంగా నదీ పరీవాహక ప్రాంతంలోనే 4,700కు పైగా హిమానీనద సరస్సులు ఉన్నట్లు పేర్కొంటున్నారు. వీటన్నింటికీ ఒకే స్థాయిలో ప్రమాదం ఉందని మాత్రం భావించకూడదు. పరిమాణం, నీటి నిల్వ, సహజ అడ్డుకట్టల స్థిరత్వం, పరిసర భౌగోళిక పరిస్థితుల ఆధారంగా ప్రమాదాన్ని అంచనా వేస్తున్నారు. సుమారు 195 నుంచి 200 సరస్సులను అధిక ప్రమాదం ఉన్నవిగా గుర్తించినట్లు సమాచారం. హిమానీనద సరస్సు విస్ఫోట వరద ప్రభావం కేవలం మంచుకొండలకే పరిమితం కావాల్సిన అవసరం లేదు. ఎగువ ప్రాంతాల్లో ఒక్కసారిగా భారీ జలప్రవాహం ఏర్పడితే నదుల ద్వారా దిగువ ప్రాంతాలకు చేరి వరద తీవ్రతను పెంచే అవకాశం ఉంటుంది. నేపాల్ వైపు నుంచి ప్రవహించే కోసి, గండక్ వంటి నదీ వ్యవస్థల్లో అసాధారణ వరద ప్రవాహాలు ఏర్పడితే ఉత్తర బీహార్‌లోని పలు ప్రాంతాలపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. అలాగే సిక్కిం హిమాలయ ప్రాంతంలో విపత్తులు సంభవిస్తే తీస్తా నదీ పరీవాహకంలోని సిక్కిం, ఉత్తర బెంగాల్ ప్రాంతాలకు ముప్పు ఏర్పడవచ్చు. అయితే ఒక సరస్సు విస్ఫోటనం వల్ల 'పలు రాష్ట్రాలు కొట్టుకుపోతాయి' అని సాధారణీకరించడం సరికాదు. ప్రభావ తీవ్రత సరస్సు పరిమాణం, భౌగోళిక పరిస్థితులు, నదీ ప్రవాహ మార్గం వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. హిమాలయాల్లో ఉష్ణోగ్రతల మార్పులు, హిమానీనదాల కరుగుదలతో సరస్సుల పరిమాణంలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉండటంతో నిరంతర పర్యవేక్షణ కీలకంగా మారుతోంది. దీనికి తోడు పర్వత ప్రాంతాల్లో విచక్షణారహిత నిర్మాణాలు, నదుల సహజ ప్రవాహ మార్గాల్లో ఆక్రమణలు, పర్యావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోని మౌలిక వసతుల నిర్మాణం విపత్తు సంభవించినప్పుడు నష్టాన్ని మరింత పెంచవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రమాదకర హిమానీనద సరస్సులను గుర్తించి వాటిపై నిరంతర నిఘా ఉంచడం ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది. ఉపగ్రహ చిత్రాల ద్వారా సరస్సుల విస్తీర్ణం, నీటి నిల్వలో మార్పులు, పరిసర భూభాగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలను పరిశీలించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అధిక ప్రమాదం ఉన్న సరస్సుల వద్ద నీటిమట్టం, ఉష్ణోగ్రత తదితర మార్పులను గుర్తించే ఆటోమేటిక్ సెన్సార్లతో ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను ఏర్పాటు చేయడం, ప్రమాద ప్రాంతాలను మ్యాపింగ్ చేయడం, అవసరమైన చోట సురక్షిత డ్రైనేజీ, నీటి మళ్లింపు వంటి ఇంజనీరింగ్ చర్యలు చేపట్టడం కీలకమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రమాద ప్రాంతాల్లో విచక్షణారహిత నిర్మాణాలను నియంత్రించడం కూడా అంతే ముఖ్యమని చెబుతున్నారు. నేపాల్ విపత్తు మరోసారి వినిపిస్తున్న హెచ్చరిక ఒక్కటే.. హిమాలయాల్లో పేరుకుపోతున్న జలరాశులను తేలిగ్గా తీసుకోవద్దు. మంచుకొండల మధ్య నిశ్శబ్దంగా ఉన్న సరస్సు ఎప్పుడు ప్రమాదకరంగా మారుతుందో నిరంతర శాస్త్రీయ పర్యవేక్షణతోనే గుర్తించగలం. విపత్తు వచ్చిన తర్వాత సహాయక చర్యలకంటే.. ముందే ప్రమాదాన్ని పసిగట్టి ప్రజలను అప్రమత్తం చేయడమే అసలైన రక్షణ.

# జాతీయ జెండాను అవమానిస్తే మూల్యం తప్పదు

**ఖలిస్థానీ వేర్పాటువాదులకు కిరణ్ రిజిజు హెచ్చరిక**

- న్యూయార్క్‌లో ఘటనపై కేంద్ర మంత్రి ఆగ్రహం
- దేశాన్ని, జెండాను అవమానించొద్దని హితవు
- నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



**న్యూఢిల్లీ, ఆగస్టు 31:** న్యూయార్క్‌లో భారత జాతీయ జెండాను అవమానించిన ఖలిస్థానీ వేర్పాటువాదులకు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు గట్టి హెచ్చరిక చేశారు. దేశాన్ని, జాతీయ జెండాను అవమానించే వారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని పేర్కొన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు. న్యూయార్క్‌లోని మ్యాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో జరిగిన సభకు ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ హాజరైన సందర్భంగా స్టేడియం వెలుపల చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వీడియోను రిజిజు పంచుకున్నారు. "ఆర్ఎస్ఎస్‌ను లేదా బీజేపీని విమర్శించే హక్కు మీకు ఉందని మేము ఎప్పటి నుంచో చెబుతున్నాం. కానీ మా దేశాన్ని అవమానించవద్దు. ఒక విషయం జాగ్రత్తగా వినండి. మా దేశాన్ని, జాతీయ జెండాను అవమానిస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు" అని రిజిజు హెచ్చరించారు. వీడియోలో కనిపిస్తున్న దృశ్యాల ప్రకారం.. స్టేడియం వెలుపల కొందరు ఖలిస్థానీ మద్దతుదారులు నిరసనకు దిగారు. వారిలో ఓ వ్యక్తి భారత జాతీయ జెండాను కాలికి చుట్టుకుని అవమానించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనపై సామాజిక మాధ్యమాల్లో పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితులను గుర్తించి చర్యలు చేపట్టాలని అమెరికా ప్రభుత్వాన్ని కోరారు. ఆర్ఎస్ఎస్ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మోహన్ భాగవత్ ప్రసంగించారు. అమెరికాలో ఉంటూ ఉపాధి పొందుతున్న వారు తమ కర్మభూమి పట్ల బాధ్యతను నెరవేర్చడంతో పాటు మాతృభూమితో అనుబంధాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. వివిధ దేశాల్లోని హిందువులు బాధ్యతాయుత జీవనంతో ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు.

# బాణాసంచా కర్మాగారంలో భారీ పేలుడు

**పేలుడు ధాటికి 11 మంది దుర్మరణం**


**యూపి సీఎం యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి**



**లక్నో, ఆగస్టు 31:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని కౌశాంబి జిల్లాలో సోమవారం మధ్యాహ్నం ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. ఓ బాణసంచా కర్మాగారంలో భారీ పేలుడు సంభవించి 11 మంది మృతిచెందగా.. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దారుణ ఘటన పిప్రి పోలీస్ స్టేషన్ పరిధి మనోరి గ్రామంలో చోటుచేసుకుంది. మృతులను ప్రియాంజలి (5), ప్రవీణ్ సింగ్ (13), జహన్వి (12), ఆదిత్య (12), ఆదిత్య (8), రవి (8), అంజు (32), జ్ఞాన్ సింగ్ (40), విక్రమ్ సరోజ్ (35), అన్ష్ (6), నానా (4)గా పోలీసులు గుర్తించారు. మృతులంతా ఫ్యాక్టరీ చుట్టుపక్కల నివసిస్తున్న వారేనని అధికారులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం వేళ బాణసంచా కర్మాగారంలో ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు స్థానికంగా బీభత్సం సృష్టించింది. భారీ శబ్దంతో పేలుడు జరగడంతో ఫ్యాక్టరీ చుట్టుపక్కల ఇళ్లని పూర్తిగా ధ్వంసమయ్యాయి. తీవ్రంగా గాయపడిన 16 మందిని ప్రయాగ్‌రాజ్‌లోని ఎస్ఆర్ఎన్ ఆస్పత్రికి తరలించగా.. 11 మంది చికిత్స పొందుతూ మరణించారని జిల్లా మేజిస్ట్రేట్ అమిత్ పాల్ తెలిపారు. మరో ఐదుగురికి చికిత్స అందుతోందని ఆయన వెల్లడించారు. ఈ ఘటనలో మొత్తం 18 మందికి పైగా గాయపడినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. శిథిలాలను తొలగిస్తూ వాటి కింద చిక్కుకున్న వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంపై ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కౌశాంబి జిల్లాలో ప్రమాదం తీవ్రంగా బాధించింది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. గాయపడిన వారికి సరైన వైద్య చికిత్స అందేలా చూడాలని, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా సహాయం అందించాలని స్థానిక అధికారుల కు ఆదేశాలు జారీ చేశాం. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ. 2లక్షలు, గాయపడిన వారికి ఒక్కొక్కరికీ రూ. 50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని ఆదేశాలు జారీ చేశాం.. అని ఎక్స్ వేదికగా పోస్టు చేశారు.

# మోదీ-పుతిన్ కీలక భేటీ

- వాణిజ్యం నుంచి రక్షణ వరకు విస్తృత చర్చలు
- ఇంధనం, పెట్టుబడుల సహకారంపై ప్రత్యేక దృష్టి
- ఎస్‌సీవో సదస్సు వేదికగా ఇరువురు నేతల సమావేశం
- ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌తోనూ మోదీ భేటీ
- 'నోమాడ్ గేమ్స్'కు హాజరైన మోదీ-పుతిన్



**బిష్కెక్:** షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కీలకంగా సమావేశమయ్యారు. భారత్–రష్యా ద్వైపాక్షిక సంబంధాలతో పాటు వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, రక్షణ రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించడంపై ఇరువురు నేతలు చర్చించారు. కిర్గిజ్‌స్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరుగుతున్న ఎస్‌సీవో సదస్సు సందర్భంగా ఈ భేటీ జరిగింది. భారత్–రష్యా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు ఇరు దేశాలకు సంబంధించిన కీలక అంశాలను నేతలు సమీక్షించినట్లు సమాచారం. ఇటీవల మాస్కోలో భారత్–రష్యా అంతర్ ప్రభుత్వ కమిషన్ సమావేశం విజయవంతంగా జరిగిందని, దానికి కొనసాగింపుగా మోదీ–పుతిన్ భేటీలో ద్వైపాక్షిక సంబంధాలపై సమగ్ర సమీక్ష జరుగుతుందని భారత విదేశాంగ శాఖ అంతకుముందు వెల్లడించింది. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఇటీవల రష్యాలో రెండు రోజుల పర్యటన సందర్భంగా క్రెమ్లిన్‌లో పుతిన్‌తో సమావేశమయ్యారు. ప్రధాని మోదీ శుభాకాంక్షలను ఆయనకు తెలియజేశారు. ఈ పరిణామాల అనంతరం మోదీ–పుతిన్ ప్రత్యక్షంగా సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**ఇరాన్ అధ్యక్షుడితోనూ మోదీ భేటీ**

ఎస్‌సీవో సదస్సు సందర్భంగా ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తోనూ ప్రధాని మోదీ సమావేశమయ్యారు. దాదాపు రెండేళ్ల తర్వాత ఇరు దేశాల నేతలు సమావేశమైనట్లు కథనం పేర్కొంది. భారత్–ఇరాన్ సంబంధాలకు సంబంధించిన అంశాలు ఈ సందర్భంగా చర్చకు వచ్చినట్లు తెలిపింది. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తోనూ మోదీ సమావేశమయ్యే అవకాశమున్నట్లు సమాచారం. అయితే ఇరువురు నేతల మధ్య ప్రత్యేక ద్వైపాక్షిక సమావేశానికి అధికారికంగా షెడ్యూల్ ఖరారు కాలేదని పేర్కొంది.

**'నోమాడ్ గేమ్స్'లో మోదీ--పుతిన్**

ఎస్‌సీవో సదస్సు కార్యక్రమాల అనంతరం నిర్వహించిన 'నోమాడ్ గేమ్స్'కు మోదీ, పుతిన్ హాజరయ్యారు. అంతర్జాతీయ వేదికపై ఇరువురు నేతలు కలిసి పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అంతకుముందు ప్రధాని మోదీ రెండు రోజుల ఉజ్బెకిస్థాన్ పర్యటనలో ఆ దేశ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయేవ్‌తో సమావేశమయ్యారు. శతాబ్దాల నాటి సాంస్కృతిక సంబంధాలు, ప్రజల మధ్య అనుబంధాన్ని పునాదిగా చేసుకుని భారత్–ఉజ్బెకిస్థాన్ ద్వైపాక్షిక సంబంధాలను మరింత విస్తరించడంపై ఇరువురు నేతలు చర్చించినట్లు భారత విదేశాంగ శాఖ తెలిపింది. 2001లో చైనా, రష్యా, నాలుగు మధ్య ఆసియా దేశాలతో భద్రతా వేదికగా ప్రారంభమైన షాంఘై సహకార సంస్థ.. కాలక్రమేణా సభ్యత్వం, ప్రభావాన్ని విస్తరించుకుంది. తాజా సదస్సు సందర్భంగా భారత్–రష్యా సంబంధాలపై జరిగిన మోదీ–పుతిన్ భేటీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

# అమెరికా-కెనడా మధ్య వాణిజ్య యుద్ధం

**కెనడా దారుణమైన దుర్వినియోగదారు**

**కెనడాలో ఉన్న కంపెనీలన్నీ అమెరికాకు వచ్చేయాలి**

**ట్రూత్‌లో ట్రంప్ వరుస పోస్టులు**

**వాషింగ్టన్, ఆగస్టు 31:** అమెరికా–కెనడా మధ్య వాణిజ్య యుద్ధం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలకు కెనడా ప్రధాని మార్క్ కార్నీ సహా ఇతర నేతలు గట్టిగా బదులు ఇస్తుండటంతో రెండు దేశాలు సంబంధాలు దిగజారుతున్నాయి. ఈ క్రమంలోనే ట్రంప్ మరోసారి ఆ దేశంపై విరుచుకుపడ్డారు. తమకు కెనడా నుంచి ఏమీ వద్దని పేర్కొన్న ఆయన తమ సుంకాలను తప్పించుకునేందుకు అక్కడి కంపెనీలన్నీ అమెరికాకు తరలివచ్చేయాలని సూచించారు. ఆ దేశం దారుణమైన దుర్వినియోగదారు అని మండిపడ్డారు. ఈ మేరకు ట్రూత్‌లో వరుస పోస్టులు పెట్టారు. 2024 అధ్యక్ష ఎన్నికల్లో నేను పోటీ చేస్తున్నానని ప్రకటించిన సమయంలోనే డెట్రాయిట్‌లోని కీలక ఫ్యాక్టరీని మూసివేయడానికి ఫోర్డ్ సిద్ధమైంది. ఎన్నికల్లో నేను ఆధిక్యంలోకి రావడంతో ఏం జరుగుతుందో చూద్దామని ఆ సంస్థ వేచి చూసింది. ఇప్పుడు నిరంతరాయంగా నడుస్తూ.. భారీగా లాభాలను ఆర్జిస్తోంది. జనరల్ మోటార్స్, ఇతర సంస్థల విషయంలో ఇలాంటి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. సుంకాల వల్లే ఇదంతా జరిగింది. మనకు కెనడియన్ కార్లు, పరికరాలు సహా ఏమీ వద్దు. కెనడాతో వాణిజ్యంలో అమెరికా ఏటా 60 బిలియన్ డాలర్లుకుపైగా నష్టపోతోంది. దశాబ్దాలుగా ఈ దోపిడీ జరుగుతోంది. ఏనాడో మననుంచి లాగేసుకున్న



వ్యాపారాలన్నీ సుంకాలను తప్పించుకోవడానికి ఇప్పుడు అమెరికాకు బారులు తీరుతున్నాయి. కెనడా పట్ల కఠిన వైఖరిని అవలంబించడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని ట్రంప్ విమర్శలు చేశారు. అమెరికా–కెనడా మధ్య వాణిజ్య ఒప్పందం చివరి నిమిషంలో రద్దయింది. అమెరికా ఇప్పటికే 50 శాతం సుంకాలతో విరుచుకుపడగా.. కెనడా సైతం అగ్రరాజ్యంపై తాజాగా ప్రతీకార సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. కెనడియన్ కార్లు, ట్రక్కులు, ఆటోమోటివ్ విడిభాగాలు, ఉక్కు దిగుమతులపై ట్రంప్ 50శాతం టారిఫ్‌లు విధించారు.

# ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించాలి

.జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక.




**నారాయణపేట, ఆగస్టు 31(సమయం న్యూస్)** విద్యార్థులకు చిన్ననాటి నుంచే డబ్బు వినియోగం, పొదుపు, పెట్టుబడులు, ఆర్థిక ప్రణాళిక వంటి అంశాలపై అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమని జిల్లా కలెక్టర్ ప్రియాంక అన్నారు. సోమవారం జిల్లా కేంద్రం లోని ఎర్ర గుట్ట వద్ద గల గురుకుల బాలికల పాఠశాలలో స్వత: ఫౌండేషన్ సౌజన్యంతో జిల్లాలోని ఎంఈవో, హెచ్ ఎం లకు ఫైనాన్స్ లిటరసీ, మనీ మంత్ర పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రియాంక ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ఫైనాన్షియల్ లిటరసీ కార్యక్రమానికి జిల్లాలోని 88 ప్రాథమికోన్నత పాఠశాలలు, ఎంపిక కావడం విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు కూడా గొప్ప అవకాశమన్నారు.డబ్బు సంపాదించడం ఎంత ముఖ్యమో, సంపాదించిన డబ్బును సక్రమంగా పొదుపు చేయడం, సరైన విధంగా పెట్టుబడి పెట్టడం, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఆర్థిక ప్రణాళిక రూపొందించుకోవడం అంతకంటే ముఖ్యమని తెలిపారు.ప్రస్తుతం సోషల్ మీడియా, టెక్నాలజీ ద్వారా త్వరగా ఎక్కువ డబ్బు సంపాదించవచ్చనే ఆకర్షణీయమైన ప్రకటనలు, తప్పుడు పెట్టుబడి పద్ధతులు విద్యార్థులు, యువతను ప్రభావితం చేసే అవకాశం ఉందన్నారు. అత్యాశకు లోనై ఆర్థికంగా నష్టపోయి, సమస్యలను ఎదుర్కొంటున్న ఘటనలు మనం చూస్తున్నామని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులను నివారించేందుకు విద్యార్థులకు ఆర్థిక విషయాలపై సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.పాఠశాల స్థాయిలోనే ఆర్థిక అక్షరాస్యతను సాధారణ విద్యా విధానంలో భాగంగా ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. 12వ తరగతి వరకు చాలామంది విద్యార్థులు స్వయంగా పెద్ద మొత్తంలో డబ్బును నిర్వహించే అవకాశం ఉండదని, భవిష్యత్తులో ఒకేసారి పెద్ద మొత్తంలో డబ్బు చేతికి వచ్చినప్పుడు దానిని ఎలా సక్రమంగా వినియోగించాలో తెలియక ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంటుందని అన్నారు.స్వతహ ఫౌండేషన్ సహకారంతో జిల్లాలో ఫైనాన్షియల్ లిటరసీ కార్యక్రమం అమలు కావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని మరిన్ని పాఠశాలలకు విస్తరించేలా రానున్న రోజుల్లో ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు.ఉపాధ్యాయులు తమ రెగ్యులర్ డే ప్లాన్, సబ్జెక్ట్ ప్లాన్‌లతో పాటు ఫైనాన్షియల్ లిటరసీకి కూడా ప్రత్యేక సమయం కేటాయించాలని కలెక్టర్ సూచించారు. హెడ్మాస్టర్లు ఈ కార్యక్రమాన్ని పాఠశాల స్థాయిలో సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని కోరారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే భాషలో రూపొందించిన పుస్తకాలు, బోధనా సామగ్రి వెనుక ఎంతోమంది కృషి ఉందని, వాటిని విద్యార్థులకు నాణ్యమైన రీతిలో అందించడం ఉపాధ్యాయుల బాధ్యత అని అన్నారు.భవిష్యత్తులో పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించినప్పుడు ఫైనాన్షియల్ లిటరసీ కార్యక్రమం ఏ విధంగా అమలవుతుందో పరిశీలిస్తానని తెలిపారు.విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులందరూ బాధ్యతగా తీసుకొని విజయవంతంగా అమలు చేస్తారనే నమ్మకం తనకు ఉందని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి గోవింద రాజులు, ఏ ఎం వో విద్యా సాగర్, ఆ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## నేత్రదానంతో ఇద్ద రి జీవితాల్లో వెలుగులు

### అదనపు కలెక్ట ర్ డాక్ట ర్ పి. శ్రీజ



**ఖమ్మం, ఆగస్టు 31( సమయం న్యూస్,,)** నేత్రదానం ద్వారా మరో ఇద్ద రికి చూపు ప్రసాదించవచ్చని అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ తెలిపారు. 41వ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సోమవారం కలెక్ట రేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, మరణించిన 6 నుంచి 8 గంటల్లోపు నేత్రదానం చేయాలని సూచించారు. కళ్లద్దాలు వాడేవారు, మధుమేహం, బీపీ, ఆస్తమా ఉన్నవారు, కంటిశుక్లాల ఆపరేషన్ చేయించుకున్నవారు కూడా నేత్రదానం చేయవచ్చన్నారు. నేత్రదానంలో కార్నియాను మాత్రమే సేకరిస్తారని, మృతదేహం ముఖాకృతిలో ఎలాంటి మార్పు ఉండదని తెలిపారు. నేత్రదానం వివరాలకు ఖమ్మం ఐ బ్యాంక్ 9397191919, 9247571995 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురు పోలీసు అధికారులకు ఘన సన్మానం



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 31:** (సమయం న్యూస్)పోలీస్ శాఖలో 37 ఏళ్ల పాటు సేవలందించి పదవీ విరమణ పొందిన ఏఎస్ఐలు పసునూరి నాగరాజు, షేక్ మహబూబ్ అలీ, చాచు వెంకటేశ్వర్లును జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ సోమవారం ఘనంగా సన్మానించారు. పదవీ విరమణ అనంతరం ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించిన ఎస్పీ, వారికి రావాల్సిన ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## ఆదిలాబాద్ జిల్లా లో సెప్టె ంబర్ 1 నుంచి 30 పోలీస్ యాక్ట్ అమలు



**ఆదిలాబాద్, ఆగస్టు 31( సమయం న్యూస్):** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్-1861 అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు. డీఎస్పీ లేదా ఆపై స్థాయి అధికారుల ముందస్తు అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు, ధర్నాలు, ఊరేగింపులు, బహిరంగ సమావేశాలు నిర్వహించరాదన్నారు. ఆయుధాలు, పేలుడు పదార్థాలు తీసుకెళ్లడం నిషేధమని పేర్కొన్నారు. అధిక శబ్దం చేసే డీజేలు, స్పీకర్లు, ప్రచార రథాలు, మైకుల వినియోగంపైనా ఆంక్షలు ఉంటాయని తెలిపారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

## 22ఏ భూములపై ఆధారాలతోనే నిర్ణయాలు: కలెక్ట ర్ కోయ శ్రీహర్ష



**పెద్దపల్లి, ఆగస్టు 31:( సమయం న్యూస్)** 22ఏ నిషేధిత భూముల విషయంలో పూర్తి ఆధారాలు, రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయాలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములుతో కలిసి 22ఏ భూముల జాబితాపై రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పొరపాటున నిజమైన ప్రైవేట్ భూములు 22ఏ జాబితాలో చేరినట్లు నిర్ధారణ అయితే వాటి సమస్యలను 48 గంటల్లో పరిష్కరించాలని సూచించారు. జాబితా నుంచి తొలగించే ప్రతి సర్వే నంబర్‌కు స్పష్టమైన కారణాలు, రిమార్కులు నమోదు చేసి డిలీటెడ్ లిస్ట్‌ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా ఒకే విధానం అమలు చేయాలని, ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడొద్దని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్డీఓ గంగయ్య, తహసీల్దా ర్లు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## గౌరవెల్లి కాలువల భూసేకరణకు రూ.250 కోట్లు



- **త్వరలో సీఎం రేవంత్ రెడ్డి ప్రాజెక్టు సందర్శన: మంత్రి పొన్నం**

**సిద్దిపేట, ఆగస్టు 31( సమయం న్యూస్)** గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల భూసేకరణకు ప్రభుత్వం రూ.250 కోట్లు విడుదల చేసిందని, త్వరలో కాలువ పనులకు టెండర్లు చేపట్టనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. త్వరలో సీఎం రేవంత్ రెడ్డి ప్రాజెక్టును సందర్శిస్తారని చెప్పారు.

అక్కన్నపేట మండలం కట్కూరులో 'పల్లె పల్లెకు పొన్నం అన్న-ప్రజా పాలన' కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కట్కూరు-కన్నారం రోడ్డు విస్తరణ, సీసీ రోడ్లు, పాఠశాల అదనపు తరగతి గదులు తదితర అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టు ద్వారా కట్కూరు పరిధిలో సుమారు 900 ఎకరాలకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం




**వలిగొండ ఆగస్టు 31(సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో మండల పరిషత్ అభివృద్ధి అధికారి మరియు నోడల్ అధికారి జి. జలంధర్ రెడ్డి మార్గదర్శకత్వంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ప్రజల సమస్యలు, ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు. మొత్తం 21 వివిధ శాఖలకు చెందిన అధికారులు/సిబ్బంది కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 6 దరఖాస్తులు స్వీకరించగా, అందులో ఒక దరఖాస్తు విద్యుత్ షాక్ కారణంగా గేదెలు/గేదెలకు జరిగిన నష్టానికి సంబంధించినదిగా, వాటికి సంబంధించిన బీమా పరిహారం (ఇన్సూరెన్స్ క్లెయిమ్) మంజూరు చేయించాలని కోరుతూ సమర్పించబడింది. ఈ సందర్భంగా నోడల్ అధికారి జి. జలంధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడానికే మేము ఇక్కడ ఉన్నాము. ప్రజలు తమ సమస్యలను, ఇబ్బందులను నిరభ్యంతరంగా మా దృష్టికి తీసుకురావాలి సంబంధిత శాఖల సమన్వయంతో సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాము అని తెలిపారు.

## వివిధ భాషల్లో ఉపన్యాసం ఇచ్చిన చింతకింది వరుణ్ ను శాలువాతో సన్మానం.

**వలిగొండ ఆగస్టు 31 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధమల్ల ఆనంద్ గౌడ్ యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని పైల్వాన్ పురం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న చింతకింది వరుణ్ రజక సామాజిక వర్గానికి చెందిన బాలున్నీ పాఠశాల ఉపాధ్యాయుని శాలువాతో సత్కరించడం జరిగింది. చింతకింది వరుణ్ అనే బాలుడు వివిధ భాషల్లో ఉపన్యాసం, వ్యక్తిగత నైపుణ్యం లో ప్రావీణ్యత కనబడుచుతూ, వివిధ సోషల్ మీడియా మాధ్యమాల్లో ఉత్సాహంగా తన యొక్క నైపుణ్యాన్ని ప్రదర్శించడం జరుగుతుంది. అందుకు వారు ఆ బాలుని సన్మానించడం జరిగింది. వారు మాట్లాడుతూ నేటి బాలలు అనేక రంగాలుగా నైపుణ్యం సాధించాలని, అందుగ్గాను భారత ప్రధాని నరేంద్ర మోడీ నేటి బాలలు రేపటి భావి భారత పౌరులుగా ఉన్నత శిఖరాలకు ఎదగాలని వారు విద్యార్థుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం అనేక రంగాలుగా సహకరిస్తుందని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని వలిగొండ మండల పార్టీ అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ పర్యవేక్షించారు. వారి వెంట ఓబీసీ మోర్చా రాష్ట్ర కోఆర్డినేషన్ కన్వీనర్ సుర్వి శ్రీనివాస్ గౌడ్, ఓవిసి మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నపురం శ్రీశైలం, ఓవిసి మోర్చా జిల్లా అధ్యక్షుడు రామచంద్రం ముదిరాజ్, కిసాన్ మోర్చా జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి తెల్బూరి రాములు యాదవ్,పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు వెంకటేశం, జిల్లా నాయకులు బొడిగే ఆనంద్, కనకాల అశోక్ రెడ్డి, మండల పదాధికారులు మందుల నాగరాజు, గంగదారి దయాకర్, వెంకటేశం, శ్రీనివాస్, వివిధ గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.



## కామారెడ్డి కలెక్ట రేట్‌లో ఉచిత నేత్ర పరీక్షల శిబిరం



- **175 మందికి పరీక్షలు.. 113 మందికి కంటి అద్దా ల పంపిణీ**

**కామారెడ్డి, ఆగస్టు 31:( సమయం న్యూస్)** 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్ట రేట్‌లో ఉచిత నేత్ర పరీక్షల శిబిరం, అవగాహన సదస్సు, నేత్రదాన ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. నిపుణులైన నేత్ర వైద్యుల ద్వారా కలెక్టరేట్ ఉద్యోగులు, ప్రజలు కలిపి 175 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 113 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కంటి ఆరోగ్య పరిరక్షణ, డిజిటల్ స్క్రీన్ల వల్ల కలిగే కంటి అలసట నివారణపై అవగాహన కల్పించారు. నేత్రదానం ప్రాముఖ్యతను వివరిస్తూ అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్ట ర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. వెంకటి, ఆప్తాల్మిక్ అధికారులు రవీందర్, హరికిషన్, వైద్యులు డా. మారుతిబాబు, డా. సంతోష్‌తో పాటు వైద్య సిబ్బంది, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## షీ టీమ్ అవగాహన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ

**ఆదిలాబాద్ ఆగస్టు31( సమయం న్యూస్):** స్థానిక మైనారిటీ పాఠశాలలో సోమవారం సాయంత్రం 4:30 గంటలకు నిర్వహించే షీ టీమ్ అవగాహన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు బట్టి సావర్గం గ్రామంలో 'పోలీసులు మీకోసం' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని సీసీటీవీ కెమెరాలను ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాలకు మీడియా ప్రతినిధులు హాజరుకావాలని పోలీసు శాఖ కోరింది.

## సెప్టెంబర్ 1న జగిత్యాలలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ పర్యటన



**జగిత్యాల, ఆగస్టు 31,( సమయం న్యూస్)** రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో పాటు ఐదుగురు సభ్యులు సెప్టెంబర్ 1న జగిత్యాల జిల్లాలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయానికి చేరుకుని, 3 గంటలకు జిల్లా ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. పర్యటనలో కమిషన్ సభ్యులు కుస్రం నీలా దేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణికుంట్ల ప్రవీణ్ పాల్గొననున్నారు.

## రిపోర్టర్ వలిని పరామర్శించిన టీ జె ఏ జిల్లా అధ్యక్షుడు షానూర్



**వలిగొండ ఆగస్టు 31(సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలానికి చెందిన సూర్య దినపత్రిక స్టాఫ్ రిపోర్టర్ నాగేల్లి వలి తండ్రి నాగేల్లి రాములు ఇటీవల అనారోగ్యంతో స్వర్గస్తులైనారు. విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి పరామర్శించి, మనోధైర్యాన్ని కల్పించిన తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు, మీడియా అక్రిడెషన్ కమిటీ సభ్యులు మొహమ్మద్ షానూర్ బాబా ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం జర్నలిస్టుల కుటుంబాలకు ఆరోగ్యపరమైన సమస్యలు వచ్చినప్పుడు ప్రభుత్వము కార్పొరేట్ స్థాయి వైద్యం అందించి జర్నలిస్టు కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. వారితోపాటు టీ జె ఏ ప్రధాన కార్యదర్శి గోపరాజు వెంకన్న,జిల్లా కార్యదర్శి యానాల సత్యనారాయణ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కేసముద్రంలో రూ.1.90 కోట్ల విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభం

**కేసముద్రం: ఆగస్టు31( సమయం న్యూస్)** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండల కేంద్రంలో రూ.1.90 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి అనసూయ సీతక్క ప్రారంభించారు. అనంతరం ఉపకేంద్రం ప్రాంగణంలో మొక్క నాటారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్, ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, సీఎండీ వరుణ్ రెడ్డి, ఎస్పీ డాక్టర్ శబరిష్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్రిస్టాక్ అమలులో తెలంగాణకు మరో రూ.175 కోట్ల కేంద్ర ప్రోత్సాహకం

**హైదరాబాద్, ఆగస్టు 31( సమయం న్యూస్):** అగ్రిస్టాక్ ఆధారిత డిజిటల్ వ్యవసాయ వ్యవస్థ అమలులో తెలంగాణ మరో కీలక మైలురాయిని సాధించిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అగ్రిస్టాక్ ఆధారిత ఎరువుల పంపిణీ వ్యవస్థలో తొలి మైలురాయిని పూర్తి చేసినందుకు కేంద్ర ప్రభుత్వం రూ.175 కోట్ల ప్రోత్సాహకానికి ఆమోదం తెలిపిందన్నారు. SASCI 2026–27లోని డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫర్ అగ్రికల్చర్–అగ్రిస్టాక్ కింద ఈ నిధులు లభించనున్నాయి. ఇప్పటికే ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేసినందుకు తెలంగాణకు రూ.424 కోట్లు మంజూరయ్యాయని, తాజాగా మరో రూ.175 కోట్లు లభించనున్నాయని మంత్రి పేర్కొన్నారు. అగ్రిస్టాక్ ద్వారా రైతులు, భూములు, పంటలు, ఎరువుల పంపిణీ వివరాలను డిజిటల్‌గా అనుసంధానించి ప్రభుత్వ ప థకాలను మరింత పారదర్శకంగా, వేగంగా రైతులకు అందించవచ్చని తుమ్మల తెలిపారు.

## చర్చి పాస్టర్ కృపాకర్ పాల్‌మృతి పట్ల గ్రామ సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు సంతాపం.

### కుటుంబాన్ని పరామర్శించి ఆర్థి క సహాయం.



**యాలాల మండలం, ఆగస్టు,31(సమయం న్యూస్)** యాలాల మండలం దేవనూర్ గ్రామానికి చెందిన చర్చి పాస్టర్ కృపాకర్ పాల్ మరణించారన్న వార్త తెలియగానే గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ విషయం తెలుసుకున్న వెంటనే గ్రామ సర్పంచ్ రేణుకాదేవి కిషన్ రావు చర్చి వద్దకు వెళ్లి పాస్టర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పాస్టర్ కృపాకర్ పాల్ మృతి గ్రామానికి తీరని లోటని, ఆయన చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. బాధిత కుటుంబానికి తన వంతుగా ఆర్థిక సహాయం అందజేసి మనోధైర్యాన్ని కల్పించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో యువ నాయకులు కిరణ్ కుమార్, మెట్లి కృష్ణ, వి.గోపాల్, మైమొద్, రతన్ నాయక్, కర్వ రమేష్, నర్సిములు తదితరులు పాల్గొని పాస్టర్ కుటుంబానికి సానుభూతి తెలిపారు.

# కన్నవారి బాధ్యత మరిచి.. కాసుల కోసం ఆరాటమా?

- తల్లిదండ్రుల బాధ్యత వద్దంటే.. ఆస్తులపై హక్కెక్కడిది?
- వృద్ధాప్యం ఎవరికీ శాపంగా మారకూడదు.. వృద్ధులను వేధిస్తే కఠిన చర్యలు
- సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు మెంబర్ డాక్టర్ అనితా రెడ్డి



**హనుమకొండ, ఆగస్టు 31 (సమయం న్యూస్) :** తల్లిదండ్రుల బాధ్యతను విస్మరించే పిల్లలకు వారి ఆస్తులు, అధికారాలపై హక్కు కోరే నైతిక హక్కు లేదని సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు మెంబర్, అనురాగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. వృద్ధాప్యం ఎవరికీ శాపంగా మారకూడదని, వయోవృద్ధులను గౌరవిస్తూ వారికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. హనుమకొండ భీమారం రోడ్డులోని కేయూ సమీపంలో ఉన్న లార్డ్ వృద్ధాశ్రమాన్ని సోమవారం డాక్టర్ అనితా రెడ్డి సందర్శించారు. అక్కడి వృద్ధులను ఆత్మీయంగా పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వృద్ధుల చట్టం, సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ బెంచ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వృద్ధాశ్రమ నిర్వాహకుడు నాగరాణి నరేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ వయోవృద్ధులకు ట్రిబ్యునల్ బెంచ్ ఒక వరమని పేర్కొన్నారు. వృద్ధులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా, వేధింపులకు గురైనా ట్రిబ్యునల్‌ను ఆశ్రయించవచ్చని సూచించారు. వృద్ధులను వేధించే వారిపై చట్ట ప్రకారం క ఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తల్లిదండ్రులు జీవించి ఉన్నప్పుడే తమ ఆస్తులను పిల్లలకు పూర్తిగా పంచివేయకూడదని సూచించారు. వృద్ధాప్యంలో తమ అవసరాల కోసం కొంత ఆస్తిని తమ వద్దే ఉంచుకోవాలని, అనంతరం ఆస్తి బదలాయింపునకు వీలుగా విల్లు రాసుకోవడం మంచిదని అన్నారు. తల్లిదండ్రుల బాధ్యత తీసుకోవడానికి ఇష్టపడని పిల్లలు వారి ఆస్తులు, అధికారాలను మాత్రం కోరడం సరికాదన్నారు. వృద్ధులను గౌరవించడం, ప్రేమించడం మన సంస్కారానికి నిదర్శనమని పేర్కొన్నారు. తల్లిదండ్రులను ప్రేమించకుండా, వారిని ఇబ్బందులకు గురిచేసే వారు ఎంతటి కోటీశ్వరులైనా దరిద్రులతో సమానమని ఘాటుగా వ్యాఖ్యానించారు.

# ప్రకృతికి ప్రేమతో.. భవిష్యత్తుకు బహుమతిగా!

- ప్రొఫెసర్స్ కాలనీలో ఘనంగా హరితహారం.. పచ్చదనంతో కళకళలాడిన పరిసరాలు
- ప్రత్యేకంగా నూజివీడు మొక్కలు తెప్పించి నాటించిన డా.సాయిని వెంకటేశ్వర్లు
- రేపటి తరాలు ఊపిరి పీల్చాలంటే.. నేడు మొక్కలు నాటాలి...



**హనుమకొండ, ఆగస్టు 31 (సమయం న్యూస్) :** పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు, సామాజిక బాధ్యతను చాటేలా ప్రొఫెసర్స్ కాలనీలో సోమవారం హరితహారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సాయిని వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. కాలనీవాసులు ఉత్సాహంగా పాల్గొని పెద్ద సంఖ్యలో మొక్కలు నాటారు. ప్రొఫెసర్స్ కాలనీ పచ్చదనంతో కళకళలాడాలనే సంకల్పంతో డాక్టర్ సాయిని వెంకటేశ్వర్లు నూజివీడు నుంచి ప్రత్యేకంగా మొక్కలను తెప్పించి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రతి ఇంటి పరిసరాల్లో పచ్చదనం పెంచడంతో పాటు కాలనీని ఆహ్లాదకరమైన వాతావరణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను సంరక్షించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. నేడు నాటిన మొక్కలు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, నీడను అందిస్తాయని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు కాలనీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను భవిష్యత్తులోనూ నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు స్వయంగా మొక్కలను సమకూర్చి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన డాక్టర్ సాయిని వెంకటేశ్వర్లుకు కాలనీవాసులు అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. ప్రొఫెసర్స్ కాలనీని పచ్చదనానికి చిరునామాగా, ప్రశాంతతకు నిలయంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్స్ కాలనీ అధ్యక్షుడు రమణయ్య, రిటైర్డ్ సివిల్ ఇంజనీర్ ప్రొఫెసర్ డాక్టర్ రామయ్య, ఫార్చ్యూన్ రెసిడెన్సీ అధ్యక్షుడు బొక్క కుమార్, ఫార్చ్యూన్ హిల్స్ అధ్యక్షుడు కిషోర్, అభిరామ్ అపార్ట్మెంట్ అధ్యక్షురాలు పొన్నాల అరుంధతి, మహేందర్ రాజు, మణిదీప్ రెడ్డి, శ్రీధర్ గౌడ్, మహేందర్ రెడ్డి పెద్దులు, వెంకటేశ్వర్లు, సంపత్ రెడ్డి, పాపిశెట్టి కిరణ్, బాలరాజు, హరి, వేణుగోపాల్, బాబురావు, పావని తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు సత్యసాయి సేవా సమితి కృషి.

- మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ సర్టిఫికెట్ల పంపిణీ.
- సర్పంచ్ రేణుక దేవి కిషన్ రావు





**యాలాల మండలం, ఆగస్టు,31(సమయం న్యూస్)** శ్రీ సత్యసాయి సేవా సమితి, రంగాపూర్, తాండూర్, వికారాబాద్ జిల్లా సేవా సమితి వారి ఆధ్వర్యంలో గత 45 రోజులుగా యాలాల మండలం దేవనూర్ గ్రామంలో నిర్వహించిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.ఈ శిక్షణలో పాల్గొని పూర్తి శిక్షణ పొందిన దేవనూర్ గ్రామ మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ రేణుక దేవి కిషన్ రావు హాజరై, శిక్షణ పొందిన 20 మంది మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ,,గ్రామీణ మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఇటువంటి ఉచిత శిక్షణా కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని, సత్యసాయి సేవా సమితి వారు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. మహిళలు నేర్చుకున్న ఈ విద్యను సద్వినియోగం చేసుకొని కుటుంబానికి అండగా నిలవాలని సూచించారు.ఈ సందర్భంగా సత్యసాయి సేవా సమితి బృందం సభ్యులు మాట్లాడుతూ.. ప్రేమతత్వం,సేవాభావంతోనే సమాజ సేవ చేస్తున్నామని,భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యువనాయకులు కిరణ్ కుమార్, సంగెం రవి, మొగులాలి, కుర్వ రమేష్, గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రైల్వే ప్రాజెక్టుల పెండింగ్ సమస్యలు వేగంగా పరిష్కరించాలి:



### సీఎస్ సంజయ్ జాజు


**హైదరాబాద్, ఆగస్టు 31:( సమయం న్యూస్)** రాష్ట్రంలో పురోగతిలో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. సోమవారం సచివాలయంలో దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవతో కలిసి రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షించారు. రాష్ట్రంలో రూ.50,870 కోట్ల అంచనా వ్యయంతో 17 రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి 2,023 కిలోమీటర్ల విస్తరణకు డీపీఆర్‌లు రైల్వే బోర్డుకు సమర్పించినట్లు అధికారులు తెలిపారు. భూసేకరణ, అండర్‌పాస్‌లు, ఓవర్‌బ్రిడ్జిలు, డబ్లింగ్ పనులు, అప్రోచ్ రోడ్లు, చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు రవాణా సదుపాయాలు సహా 21 అంశాలను సమావేశంలో సమీక్షించారు. ఫ్యూచర్ సిటీ, ORR, RRR పరిధిలో రైల్వే లైన్ల విస్తరణకు ప్రణాళికలు రూపొందించాలని సీఎస్ సూచించారు. అలాగే పీఎం గతిశక్తి కింద నిధుల కోసం సమగ్ర డీపీఆర్‌లు, MMTS విస్తరణ, కొత్త టెర్మినల్స్, భవిష్యత్ రైల్వే కనెక్టివిటీ, బుల్లెట్ ట్రైన్ మార్గాలకు అవసరమైన భూసేకరణపై ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

## జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం

### జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా ఐపీఎస్

**వికారాబాద్,ఆగస్టు,31(సమయం న్యూస్)** వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా, IPS పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చిన ప్రజలను అదనపు ఎస్పీ నేరుగా కలిసి వారి సమస్యలు, ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజలు తమ సమస్యలను స్వేచ్ఛగా వివరించగా, అదనపు ఎస్పీ వాటిని సానుకూలంగా విని, సంబంధిత అధికారులు మరియు పోలీస్ సిబ్బందికి అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖను ఆశ్రయించినప్పుడు చట్టబద్ధంగా,పారదర్శకంగా, వేగవంతంగా స్పందించి, వారికి న్యాయం జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంలో, వారి సమస్యలను పరిష్కరించడంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.





# వీనస్‌కు బిగ్ షాక్

## వరుసగా 15వ ఓటమి!

**యూఎస్ ఓపెన్ తొలిరౌండ్‌లోనే ఇంటిముఖం**

**సోఫియా కెనిన్ చేతిలో వరుస సెట్లలో పరాజయం**

**46 ఏళ్ల వయసులో వైల్డ్‌కార్డ్‌తో బరిలోకి**

**మెగా టోర్నీలో రికార్డు ప్రదర్శనకు నిరాశాజనక ముగింపు**

**సింగిల్స్‌లో కొనసాగుతున్న ఓటముల పరంపర**

**న్యూయార్క్:** ఒకప్పుడు మహిళల టెన్నిస్‌ను శాసించిన అమెరికా దిగ్గజం వీనస్ విలియమ్స్‌కు మరోసారి నిరాశే ఎదురైంది. యూఎస్ ఓపెన్--2026లో వైల్డ్‌కార్డ్‌తో బరిలోకి దిగిన 46 ఏళ్ల వీనస్ తొలి రౌండ్‌లోనే పరాజయం పాలైంది. అమెరికాకే చెందిన సోఫియా కెనిన్ చేతిలో వరుస సెట్లలో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. దీంతో సింగిల్స్‌లో వీనస్‌కు ఇది వరుసగా 15వ ఓటమిగా నమోదైంది. ఇటీవల సిన్సినాటి ఓపెన్‌లోనూ ఆశించిన ఫలితం అందుకోలేకపోయిన వీనస్.. సొంతగడ్డపై జరుగుతున్న యూఎస్ ఓపెన్‌లోనైనా సత్తా చాటాలని భావించింది. అయితే తొలి రౌండ్‌లోనే కెనిన్ ఆమె ఆశలకు చెక్ పెట్టింది. తొలి సెట్‌లో వీనస్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన కెనిన్ 6-2తో సెట్‌ను సొంతం చేసుకుంది. రెండో సెట్‌లో వీనస్ గట్టిగా పోరాడినా కీలక సమయంలో కెనిన్ పైచేయి సాధించి మ్యాచ్‌ను ముగించింది. దీంతో కెనిన్ రెండో రౌండ్‌లోకి ప్రవేశించగా.. వీనస్ సింగిల్స్ ప్రయాణం తొలి రౌండ్‌లోనే ముగిసింది. సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో చిరస్మరణీయ విజయాలు సాధించిన వీనస్.. వయసును సైతం లెక్కచేయకుండా టెన్నిస్ కోర్టులో కొనసాగుతుండటం విశేషం. అయితే ఇటీవలి కాలంలో సింగిల్స్‌లో విజయాలు ఆమెకు దూరమవుతున్నాయి. తాజా పరాజయంతో వరుస ఓటముల సంఖ్య 15కు చేరింది. ఒకప్పుడు ప్రత్యర్థులకు చెమటలు పట్టించిన వీనస్.. ఇప్పుడు ఒక్క విజయం కోసం సుదీర్ఘంగా ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.



SOFIA KENIN

# మంధాన మరో మైలురాయి.. పరుగుల్లో నంబర్-2!

- సుజీ బేట్స్‌ను వెనక్కినెట్టిన భారత ఓపెనర్
- అంతర్జాతీయ క్రికెట్‌లో 10,756 పరుగులు
- అగ్రస్థానంలో మిథాలీ రాజ్
- మూడు ఫార్మాట్లలో మంధాన రికార్డుల జోరు
- వన్డేల్లోనూ వెయ్యి పరుగుల అరుదైన ఘనత







**దుబాయ్:** భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన అంతర్జాతీయ మహిళల క్రికెట్‌లో మరో మైలురాయిని అందుకుంది. మూడు ఫార్మాట్లలో కలిపి అత్యధిక పరుగులు సాధించిన మహిళా క్రికెటర్ల జాబితాలో రెండో స్థానానికి చేరుకుంది. మహిళల ఆసియా కప్‌లో థాయ్‌లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 19 పరుగులు చేసిన మంధాన.. న్యూజిలాండ్ దిగ్గజ క్రికెటర్ సుజీ బేట్స్‌ను వెనక్కినెట్టి ఈ ఘనత సాధించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో మంధాన ఖాతాలో ప్రస్తుతం 10,756 పరుగులు ఉన్నాయి. భారత మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ 10,868 పరుగులతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. మంధాన ఇప్పటివరకు 9 టెస్టుల్లో 788, 120 వన్డేల్లో 5,411, 172 టీ20ల్లో 4,557 పరుగులు సాధించింది. మూడు ఫార్మాట్లలో నిలకడగా రాణిస్తున్న మంధాన ఇటీవల లార్డ్స్ వేదికగా తన 300వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడింది. ఆ మ్యాచ్‌లో అర్ధశతకంతో మెరిసింది. చారిత్రక లార్డ్స్ మైదానంలో జరిగిన మహిళల టెస్టులో అర్ధశతకం నమోదు చేసి ప్రత్యేక గుర్తింపు సాధించింది.

### వన్డేల్లోనూ రికార్డుల మోత

వన్డేల్లో ఒక క్యాలెండర్ ఏడాదిలో వెయ్యికి పైగా పరుగులు సాధించి మంధాన మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. 18 ఇన్నింగ్స్‌ల్లో 59 సగటుతో 1,062 పరుగులు చేసి ఆస్ట్రేలియా దిగ్గజం బెలిండా క్లార్క్ పేరిట ఉన్న రికార్డును అధిగమించింది. క్లార్క్ 1997లో 970 పరుగులు సాధించగా.. దాదాపు 27 ఏళ్ల తర్వాత ఆ రికార్డును మంధాన తిరగరాసింది. ఒక క్యాలెండర్ ఏడాదిలో అత్యధిక వన్డే పరుగులు చేసిన మహిళల జాబితాలో మంధాన అగ్రస్థానంలో నిలవగా.. దక్షిణాఫ్రికా స్టార్ లారా వోల్వార్డ్ 882 పరుగులతో తర్వాతి స్థానాల్లో నిలిచింది. న్యూజిలాండ్‌కు చెందిన డెబ్బీ హాక్లీ 880, అమీ సాటర్త్‌వైట్ 853 పరుగులతో ఈ జాబితాలో చోటు సంపాదించారు. బ్యాటింగ్‌లో నిలకడగా రాణిస్తూ ఒక్కో రికార్డును తన ఖాతాలో వేసుకుంటున్న మంధాన.. ఇప్పుడు అంతర్జాతీయ పరుగుల్లో మిథాలీ రాజ్ రికార్డుకు మరింత చేరువైంది.

# హాకీ వరల్డ్ కప్ 2026 విజేత జర్మనీ

**స్పెయిన్‌పై 1-0తో విజయం!**

**వరుసగా రెండో ప్రపంచకప్ టైటిల్**

**నాలుగోసారి విశ్వవిజేతగా జర్మనీ**

**పాకిస్థాన్ రికార్డు సమం**

**అర్జెంటీనాకు కాంస్య పతకం**



**వావ్రే, ఆగస్టు 30:** పురుషుల హాకీ ప్రపంచకప్--2026లో జర్మనీ విశ్వవిజేతగా నిలిచింది. బెల్జియంలోని వావ్రేలో ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్లో స్పెయిన్‌ను 1-0 గోల్ తేడాతో ఓడించి టైటిల్‌ను నిలబెట్టుకుంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన జర్మనీ మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుతూ వరుసగా రెండో ప్రపంచకప్‌ను సొంతం చేసుకుంది. హోరాహోరీగా సాగిన ఫైనల్లో తొలి రెండు క్వార్టర్లలో ఇరు జట్లు గోల్ కోసం తీవ్రంగా ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. స్పెయిన్ ఎక్కువసేపు బంతిని తన ఆధీనంలో ఉంచుకోవడంతో పాటు పెనాల్టీ కార్నర్లు సంపాదించినా.. జర్మనీ పటిష్టమైన డిఫెన్స్‌ను ఛేదించలేకపోయింది.

### ఒక్క గోల్.. కప్ సొంతం

మూడో క్వార్టర్ చివర్లో మ్యాచ్ మలుపు తిరిగింది. 44వ నిమిషంలో జర్మనీకి లభించిన అవకాశాన్ని మైకేల్ స్ట్రుతాఫ్ గోల్‌గా మలచడంతో ఆ జట్టు 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత స్పెయిన్ సమం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించినా జర్మనీ రక్షణ గోడను దాటలేకపోయింది. మ్యాచ్ ముగియడానికి నాలుగు నిమిషాల కంటే తక్కువ సమయం ఉండగా స్పెయిన్ గోల్‌కీపర్‌ను వెనక్కి తీసుకుని అదనపు అవుట్‌ఫీల్డ్ ఆటగాడిని రంగంలోకి దించింది. చివరి నిమిషాల్లో వరుస దాడులు చేసినా గోల్ మాత్రం దక్కలేదు. చివరి హూటర్ మోగేసరికి 1-0 ఆధిక్యాన్ని నిలబెట్టుకున్న జర్మనీ ప్రపంచకప్‌ను ముద్దాడింది.

### నాలుగోసారి విశ్వవిజేత

ఈ విజయంతో జర్మనీ నాలుగోసారి పురుషుల హాకీ ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది. గతంలో 2002, 2006, 2023లో టైటిళ్లు సాధించిన జర్మనీ.. 2026లో మరోసారి విజేతగా నిలిచి పాకిస్థాన్ పేరిట ఉన్న నాలుగు ప్రపంచకప్‌ల రికార్డును సమం చేసింది. పాకిస్థాన్ 1971, 1978, 1982, 1994లో విశ్వవిజేతగా నిలిచింది. మరోవైపు స్పెయిన్‌కు మూడో ప్రపంచకప్ ఫైనల్లోనూ నిరాశే ఎదురైంది. 1971, 1998లో రన్నరప్‌గా నిలిచిన ఆ జట్టు.. ఈసారి కూడా టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచిపోయింది. ఫైనల్లో లభించిన నాలుగు పెనాల్టీ కార్నర్లను గోల్స్‌గా మలచుకోలేకపోవడం స్పెయిన్‌ను దెబ్బతీసింది. విజయం అనంతరం గోల్ హీరో మైకేల్ స్ట్రుతాఫ్ మాట్లాడుతూ జట్టు ప్రదర్శన పట్ల గర్వంగా ఉందని పేర్కొన్నాడు. యువ ఆటగాళ్లతో కూడిన తమ జట్టు సమష్టిగా పోరాడిందని తెలిపాడు. జర్మనీ కెప్టెన్ టామ్ గ్రాంబుష్ తమ తదుపరి లక్ష్యం లాస్ ఏంజెల్స్--2028 ఒలింపిక్స్ అని స్పష్టం చేశాడు.

### అర్జెంటీనాకు కాంస్యం

మూడో స్థానం కోసం జరిగిన పోరులో అర్జెంటీనా 2-1 గోల్స్ తేడాతో నెదర్లాండ్స్‌ను ఓడించి కాంస్య పతకాన్ని దక్కించుకుంది. ఈ ప్రపంచకప్‌లో మొత్తం 16 జట్లు తలపడగా 50 మ్యాచ్‌లు జరిగాయి. మొత్తం 248 గోల్స్ నమోదయ్యాయి. వాటిలో 136 ఫీల్డ్ గోల్స్, 97 పెనాల్టీ కార్నర్ గోల్స్, 15 పెనాల్టీ స్ట్రోక్ గోల్స్ ఉన్నాయి.

ఒక్క గోల్‌తో ఫైనల్‌ను శాసించిన జర్మనీ.. వరుసగా రెండోసారి కప్పును ముద్దాడి ప్రపంచ హాకీలో తన ఆధిపత్యాన్ని మరోసారి చాటుకుంది.



# ఫుట్‌బాల్‌కు మెస్సీ వీడ్కోలు..!

**బ్యూనస్ ఎయిర్స్, ఆగస్టు 31:** ప్రపంచంలోని ఫుట్‌బాల్ అభిమానులకు షాకింగ్ న్యూస్. అర్జెంటీనా స్టార్ లియోనల్ మెస్సీ వీడ్కోలు పలికాడు. తన ఆటతో కోట్లాదిమందిని మంత్రముగ్ధులను చేసిన ఈ దిగ్గజం సోమవారం అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు అల్విదా చెప్పేశాడు. ఇటీవలే తన తండ్రి మరణాంతరం మైదానంలోకి దిగిన ఈ ఫార్వర్డ్ ప్లేయర్ హఠాత్తుగా సంచలన నిర్ణయంతో అందర్నీ ఆశ్చర్యపరిచాడు. ప్రపంచ సాకర్‌లో ఓ శకం ముగిసింది. దాదాపు రెండు దశాబ్దాలకు పైగా తన ఆటతో అభిమానులను ఉర్రూతలూగించిన లియోనల్ మెస్సీ వీడ్కోలు పలికాడు. అర్జెంటీనా దిగ్గజ ఆటగాడిగా, వరల్డ్‌కప్ సాధించిన కెప్టెన్‌గా అతడు తన సుదీర్ఘ కెరీర్‌ను ముగించాడు. నాలుగేళ్ల క్రితం ఖతార్‌లో తన కెప్టెన్సీలో అర్జెంటీనాను ఫిఫా వరల్డ్‌కప్ విజేతగా నిలిపిన మెస్సీ.. ఈసారి కూడా గట్టిగానే ప్రయత్నించాడు. కానీ, ఫైనల్లో స్పెయిన్ కప్‌ను ఎగరేసుకుపోయింది. తన రిటైర్మెంట్ వార్తను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వెల్లడించాడీ మెస్సీ. జులై 20న ఫిఫా ఫైనల్లో స్పెయిన్ చేతిలో ఓటమి అనంతరం వీడ్కోలుపై ఆలోచించిన మెస్సీ ఎట్టకేలకు సోమవారం తన నిర్ణయాన్ని ప్రకటించాడు. 'ఫిఫా వలర్డ్‌కప్ ఫైనల్ ముగిసినప్పటి నుంచి వీడ్కోలు గురించి ఆలోచిస్తున్నా. అర్జెంటీనా ఫుట్‌బాల్ నుంచి నేను రిటైరవుతున్నాని ప్రతి ఒక్కరికి తెలియజేస్తున్నా. ఈ నిర్ణయం నన్నెంతగానో బాధిస్తోంది. అయినా సరే ఇదే సరైన సమయం అనిపించింది' అని మెస్సీ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో మూడు పేజీల లేఖను పోస్ట్ చేశాడీ వెటరన్. 'అర్జెంటీనా ఫుట్‌బాల్ కోసం నేను సర్వం ధారపోశాను. గత కొన్ని ఏళ్లు సాధిస్తున్న విజయాలకు ముందు నుంచీ నేను ఎంతో చేశా. అర్జెంటీనా అభిమానులుగా మీరు సంతోషపడేందుకు, గర్వపడేందుకు తెలుపు, నీలం రంగు జెర్సీకోసం నేను ఎంతో పోరాడాను. అయితే.. ఇప్పుడు మరింత సమయం లేదు. విభిన్నమైన అధ్యాయాలు ముగియనున్నాయి. ఈ విషయం నన్ను చాలా బాధిస్తోంది. జాతీయ జట్టుకు ఆడడాన్ని నేను ఎంతో ఇష్టపడ్డాను. ఎల్లప్పుడూ ఇష్టపడతాను కూడా. ప్రతిభావంతులైన యువ ఆటగాళ్లు నా స్థానంలో రాబోతున్నారు'అని పేర్కొన్న మెస్సీ.. ఇకపై క్లబ్స్ తరఫున మైదానంలో ఫ్యాన్స్‌ను అలరించనున్నాడు. ప్రస్తుతానికి ఇంటర్ మియామికి ఆడుతున్న మెస్సీ తనను ఎంతో ప్రేమించి, మద్దతుగా నిలిచిన అర్జెంటీనా అభిమానులకు ధన్యవాదాలు తెలిపాడు.



# క్యాన్సర్ పుకార్లను తోసిపుచ్చిన నటి ప్రేమ

## సరైన జోడీ కుదిరితే రెండో పెళ్లికి ఓకే

దక్షిణాది సినీ పరిశ్రమలో ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన సీనియర్ నటి ప్రేమ.. తన వ్యక్తిగత జీవితంపై వచ్చిన పలు రూమర్లకు తాజాగా చెక్ పెట్టారు. ముఖ్యంగా తనకు క్యాన్సర్ వచ్చిందంటూ గతంలో జరిగిన ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో తన రెండో వివాహంపై వస్తున్న వార్తలపైనా ఆమె ఆసక్తికరంగా స్పందించారు. జీవితాంతం తనకు తోడుగా ఉండే సరైన వ్యక్తి దొరికితే వయసుతో సంబంధం లేకుండా పెళ్లి చేసుకోవడానికి సిద్ధమేనని ఆమె పేర్కొన్నారు. కాగా, తెలుగు, కన్నడ చిత్ర పరిశ్రమల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ప్రేమ.. వెంకటేష్ సరసన నటించిన 'ధర్మచక్రం', కోడి రామకృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన 'దేవి' వంటి సినిమాల తో తెలుగు ప్రేక్షకులకు ఎంతో దగ్గరయ్యారు. గతంలో తనకు క్యాన్సర్ సోకిందంటూ కొన్ని వార్తలు ప్రచారంలోకి రావడంపై ప్రేమ తీవ్రంగా స్పందించారు. తాను న్యూజిలాండ్‌కు స్నేహితురాలిని కలవడానికి వెళ్లిన సమయంలో ఈ పుకార్లు వ్యాపించాయని తెలిపారు. క్యాన్సర్‌తో పోరాడి విజయం సాధించిన సోనాలి బింద్రే, మమతా మోహన్‌దాస్, గౌతమి వంటి నటీమణులను ఆమె గుర్తుచేసుకున్నారు. అయితే తనకు మాత్రం అలాంటి అనారోగ్య సమస్య ఏదీ లేదని స్పష్టం చేశారు. దేవుడి దయతో తాను సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నానని తెలిపారు. తన గురించి ఇలాంటి తప్పుడు వార్తలు రావడం బాధ కలిగించిందని చెప్పిన ప్రేమ.. ఆ సమయంలో తల్లిదండ్రుల అండ తనకు ఎంతో మానసిక బలాన్ని ఇచ్చిందని వెల్లడించారు. ప్రేమ వ్యక్తిగత జీవితంలో 2006లో వ్యాపారవేత్త జీవన్ అప్పాచ్చును వివాహం చేసుకున్నారు. అయితే కుటుంబ విభేదాల కారణంగా 2016లో వీరిద్దరూ చట్టబద్ధంగా విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి ప్రేమ ఒంటరిగా ఉంటున్నారు. ఇటీవల ఆమె రెండో పెళ్లి చేసుకోబోతు న్నారంటూ వార్తలు రావడంతో ఈ అంశంపై కూడా ఆమె స్పందించారు. పెళ్లి అనేది పూర్తిగా తన వ్యక్తిగత నిర్ణయమని స్పష్టం చేశారు.

# షూటింగ్ సెట్‌లోకి అడుగుపెట్టిన రష్మిక

షూటింగ్‌లో గాయపడిన నటి రష్మిక కోలుకున్నారు. తిరిగి సెట్స్‌లోకి అడుగుపెట్టారు. ఈ సందర్భంగా ఇంట్లో విశ్రాంతి తీసుకున్న రోజులను గుర్తుచేసుకుంటూ ఓ పోస్ట్ పెట్టారు. 'తిరిగి షూట్‌కు వెళ్తున్నా. కానీ, ఈ క్షణాలను మాత్రం కచ్చితంగా మిస్ అవుతాను' అంటూ వరలక్ష్మి వ్రతం చేస్తోన్న ఫొటోలతో పాటు.. ఇంట్లో తాను ఆడుకున్న పజిల్ చిత్రాలను షేర్ చేశారు. ఎట్టకేలకు రష్మిక తిరిగి సెట్‌లోకి వెళ్లడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. ఆమెకు జాగ్రత్తలు చెబుతూ.. 'క్వీన్ ఈజ్ బ్యాక్' అంటూ నెట్టింట కామెంట్స్ చేస్తున్నారు. 'మైసా' చిత్రీకరణ సమయంలో రష్మిక గాయపడ్డారు. షూటింగ్‌లో భాగంగా ఓ పాటకు డ్యాన్స్ చేస్తుండగా తుంటి భాగంలో బలమైన గాయమైంది. ఆరు వారాలపాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. దీంతో రష్మిక ఇంట్లో ఉండి తరచూ తన హెల్త్ అప్‌డేట్‌లతో పాటు, తాను చేస్తోన్న పనులను అభిమానులతో పంచుకుంటూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్నారు.






# 'హతః' టైటిల్‌తో కిరణ్ అబ్బవరం కొత్త సినిమా



యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటుడిగానే కాకుండా నిర్మాతగానూ తనదైన ముద్ర వేయడానికి సిద్ధమవుతున్నారు. ఇటీవల 'తిమ్మరాజుపల్లి టీవీ' చిత్రంతో నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టిన ఆయన, పౌర్ణమి ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి సంయుక్తంగా నిర్మిస్తున్న తన రెండో ప్రాజెక్ట్‌కు 'హతః' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ గ్లింప్స్‌ను మేకర్స్ చాలా విభిన్నంగా రూపొందించారు. చీకటి వాతావరణంలో ఒక డార్క్ బాక్స్‌లో ఉన్న పిల్లిని చూపిస్తూ, "ఈజ్ ద క్యాట్ అలైవ్ ఆర్..." (×ర్ ష్ట్రవ ఝ్ ఖశ్రీఅజవ శీతీ...) అనే సస్పెన్స్ క్యాప్షన్‌తో టైటిల్‌ను రివీల్ చేశారు. పిల్లి బతికే ఉందా లేదా అనే ప్రశ్నతో ప్రేక్షకుల్లో తీవ్ర క్యూరియాసిటీని పెంచే ప్రయత్నం చేశారు. ఇప్పటివరకు చూడని విభిన్నమైన కథాంశంతో, కొత్త జానర్‌లో ఈ సినిమా రూపొందుతున్నట్లు సమాచారం. ఈ చిత్రానికి అనుష్ గోరాక్ రచన, దర్శకత్వంతో పాటు సినిమాటోగ్రఫీ బాధ్యతలను కూడా నిర్వహిస్తున్నారు. కుష్లు మద్దాల, రెహ్మాన్, నమ్రిత ఎంవీ, తనూజ పుట్టస్వామి తదితరులు ముఖ్య పాత్రల్లో నటిస్తుండగా, జెసిన్ జార్జ్ సంగీతాన్ని, అఖిల్ చక్రవర్తి ఎడిటింగ్ బాధ్యతలను అందిస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను మేకర్స్ త్వరలోనే వెల్లడించనున్నారు.

# విడుదలకు రెడీ అవుతున్న సర్దార్-2




కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'సర్దార్ 2' ఒకటి. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా.. గతంలో ప్రేక్షకులను ఆకట్టుకున్న 'సర్దార్' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతోంది. మొదటి భాగంలో ఏజెంట్‌గా కార్తీ చేసిన యాక్షన్, డిఫరెంట్ గెటప్‌లు ప్రేక్షకులను మెప్పించడంతో.. సీక్వెల్‌పై కూడా మంచి అంచనాలు నెలకొన్నాయి. తాజాగా 'సర్దార్ 2'కు సంబంధించి మేకర్స్ కీలక అప్డేట్ ఇచ్చారు. సినిమా తెలుగు వెర్షన్‌కు సంబంధించిన ట్రైలర్, ఆడియోను విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. దీంతో కార్తీ అభిమానుల్లో సందడి మొదలైంది. 'సర్దార్ 2'పై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి ఉంది. ఇప్పుడు తెలుగు ట్రైలర్ విడుదల కానుండటంతో సినిమాకు సంబంధించిన కథ, కార్తీ పాత్ర, యాక్షన్ సన్నివేశాలు, విలన్ క్యారెక్టర్‌పై మరింత క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా మొదటి భాగంలో కార్తీ ఏజెంట్ పాత్రకు మంచి స్పందన రావడంతో.. రెండో భాగంలో ఆ పాత్రను దర్శకుడు ఏ స్థాయిలో చూపించారనే విషయంపై అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ట్రైలర్ విడుదల తర్వాత సినిమాపై బజ్ మరింత పెరుగుతుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. 'సర్దార్'లో కార్తీ విభిన్న గెటప్‌లలో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ముఖ్యంగా ఏజెంట్ పాత్ర సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇప్పుడు అదే పాత్రను కొనసాగిస్తూ 'సర్దార్ 2'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. సీక్వెల్‌లో కథ మరింత విస్తృతంగా ఉండబోతుందని, యాక్షన్‌తో పాటు స్పై థ్రిల్లర్ అంశాలకు ప్రాధాన్యత ఉంటుందని తెలుస్తోంది. మొదటి భాగంతో పోలిస్తే రెండో భాగాన్ని మరింత భారీ స్థాయిలో తెరకెక్కించినట్లు చిత్ర బృందం చెబుతోంది. ఈ సినిమాలో విలన్ పాత్రలో విలక్షణ నటుడు ఎస్‌జే సూర్య నటిస్తున్నారు. ఆయనకు ఉన్న ప్రత్యేకమైన నటన శైలికి తగ్గట్టుగా పవర్‌ఫుల్ క్యారెక్టర్‌ను డిజైన్ చేసినట్లు సమాచారం. కార్తీ, ఎస్‌జే సూర్య మధ్య జరిగే పోరాటం సినిమాకు కీలకంగా ఉండబోతుందని టాక్. ఇప్పటికే వీరిద్దరి కాంబినేషన్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ట్రైలర్‌లో విలన్ పాత్రను ఎంతవరకు రివీల్ చేస్తారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. 'సర్దార్ 2'లో మాళవిక మోహనన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కార్తీతో ఆమె కాంబినేషన్ సినిమాకు మరో ఆకర్షణగా నిలవనుంది. యాక్షన్, థ్రిల్లర్ అంశాలతో పాటు సినిమాలో ఎమోషనల్, కమర్షియల్ ఎలిమెంట్స్ కూడా ఉండనున్నట్లు తెలుస్తోంది. 'సర్దార్ 2' చిత్రాన్ని 2026 సెప్టెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

# శ్రీవిష్ణు కొత్త మూవీ ప్రారంభం

వైవిధ్యమైన కథలు, వినోదాత్మక చిత్రాలతో ప్రేక్షకులను అలరించే కథానాయకుడు శ్రీవిష్ణు. ఇప్పుడాయన మరో ఆసక్తికరమైన కథను ప్రేక్షకులకు అందించేందుకు సిద్ధమయ్యారు. సన్నీ సంజయ్ దర్శకత్వంలో శ్రీవిష్ణు నటిస్తున్న కొత్త సినిమా ప్రకటన వచ్చింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై హారిక సూర్యదేవర నిర్మిస్తున్న కొత్త మూవీ షూటింగ్ సోమవారం మొదలైంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్ర బృందం గ్లింప్స్‌ను పంచుకుంది. 'ఇది మనందరి కథ. అందిలాగే నా కథ' అంటూ శ్రీ విష్ణు తన కథను చెబుతున్న విధానం అలరిస్తోంది. 'మరుగేలరా.. ఓ రాఘవ' అంటూ నేపథ్యంలో త్యాగరాజ కృతి వినిపించారు.




Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNIVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 7036644111, 9490140565

# సానుభూతి కాదు.. సమాన గౌరవం కావాలి

- సంచార జాతులకు విద్య, వైద్యం, ఉపాధి, రాజకీయాల్లో అవకాశాలు కల్పించాలి
- వృత్తిదారులకు 'వర్క్‌షెడ్ కమ్ హౌస్' పథకం.. ప్రత్యేక గ్రీవెన్స్ డే నిర్వహించాలి... చిప్ప వెంకటేశ్వర్లు నేత



**వరంగల్, ఆగస్టు 31 (సమయం న్యూస్) :** సంచార, అర్ధ సంచార, విముక్త జాతుల పట్ల కేవలం సానుభూతి చూపించడం కాకుండా వారికి సమాన గౌరవం, హక్కులు, అవకాశాలు కల్పించడమే నిజమైన సామాజిక న్యాయమని శ్రమశక్తి అవార్డు గ్రహీత, టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు నేత అన్నారు. ఆగస్టు 31న నిర్వహించే విముక్తి దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ జిల్లా అధికారి ఆధ్వర్యంలో సంచార, అర్ధ సంచార, విముక్త జాతుల విముక్తి దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సత్యశారద అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి చిప్ప వెంకటేశ్వర్లు నేత ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బ్రిటిష్ పాలనలో అమలైన 'క్రిమినల్ ట్రైబ్స్ యాక్ట్' కారణంగా అనేక సంచార జాతులు తీవ్ర వివక్ష, అణచివేతకు గురై నేరస్థులుగా ముద్ర వేయబడ్డాయని ఆయన గుర్తుచేశారు. స్వాతంత్ర్యం అనంతరం ఆ చట్టాన్ని రద్దు చేసి ఆయా జాతులను ఆ ముద్ర నుంచి విముక్తి చేసిన చారిత్రక సందర్భాన్ని స్మరించుకుంటూ ఆగస్టు 31న విముక్తి దినోత్సవం నిర్వహించడం ఎంతో ప్రాధాన్యమైందన్నారు. తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని హర్షం వ్యక్తం చేశారు. సంచార జాతులకు సానుభూతి అవసరం లేదని, సమాజంలో గౌరవంగా జీవించే హక్కుతో పాటు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని చిప్ప వెంకటేశ్వర్లు నేత స్పష్టం చేశారు. విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగాలు, రాజకీయ రంగాల్లో తగిన ప్రాతినిధ్యం లభించినప్పుడే వారి సాధికారత సాధ్యమవుతుందని అన్నారు. తరతరాలుగా సంప్రదాయ వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల వృత్తులను పరిరక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. వృత్తిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడంతో పాటు 'వర్క్‌షెడ్ కమ్ హౌస్' పథకాన్ని ప్రవేశపెట్టాలని సూచించారు. నివాసంతో పాటు వృత్తిని నిర్వహించుకునే సదుపాయం కల్పిస్తే వేలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని వివరించారు. సంచార, అర్ధ సంచార, విముక్త జాతుల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో ప్రతి నెలా ప్రత్యేక గ్రీవెన్స్ డే నిర్వహించాలని కలెక్టర్‌ను కోరారు. వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపే వ్యవస్థను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. డీఎన్‌టీ, ఎన్‌టీ, ఎస్‌ఎన్‌టీ వర్గాల హక్కులు, సంక్షేమం, సామాజిక గుర్తింపు, విద్య, ఉపాధి, ఆర్థిక స్వావలంబన కోసం సమగ్ర కార్యాచరణ అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తికి చేరినప్పుడే సామాజిక న్యాయం సార్థకమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, బీసీ కుల సంఘాల నాయకులు, మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ప్రతినిధులు, సంచార, అర్ధ సంచార, విముక్త జాతుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వేయి స్తంభాల ఆలయంలో ఎమ్మెల్యే నాయిని దంపతుల ప్రత్యేక పూజలు

- సర్వగ్రహ దోష నివారణ.. ప్రజల సుఖసంతోషాల కోసం గణనాథునికి అభిషేకం
- శివనామస్మరణతో మార్మోగిన వేయి స్తంభాల ఆలయం



**హనుమకొండ, ఆగస్టు 31 (సమయం న్యూస్) :** శ్రావణ బహుళ తృతీయ సోమవారం, సంకట చతుర్థిని పురస్కరించుకుని చారిత్రక వేయి స్తంభాల దేవాలయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఆయన సతీమణి నీలిమ దంపతులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మముహూర్తంలో జరిగిన సుప్రభాత సేవ, మంగళవాయిద్య సేవల్లో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. అనంతరం ఉద్దిష్ట గణపతికి ఆవుపాలు, పెరుగు, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. సర్వగ్రహ దోష నివారణతో పాటు ప్రజల సుఖసంతోషాలను ఆకాంక్షిస్తూ గణనాథునికి ప్రత్యేక పూజలు, నీరాజనం, మంత్రపుష్పాలు సమర్పించారు. సోమవారం శివునికి ప్రీతికరమైన రోజు కావడంతో స్వామివారికి రుద్రాభిషేకం, రుద్రాధ్యాయం నిర్వహించి ప్రత్యేక సేవలు చేశారు. అనంతరం ఆలయ నాట్యమండపంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంబంధిత శాఖల సహకారంతో వేయి స్తంభాల దేవాలయం దినదినాభివృద్ధి చెందుతుండటం ఆనందంగా ఉందన్నారు. ఆలయం చుట్టూ గార్డెన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, పనులు పూర్తయితే పచ్చని చెట్ల మధ్య భక్తులు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఆస్వాదించే అవకాశం కలుగుతుందని తెలిపారు. గార్డెన్ నిర్వహణను కూడా నిరంతరం మెరుగ్గా కొనసాగించాలని సూచించారు. తృతీయ సోమవారం సందర్భంగా శివభక్తులు, దాతల సహకారంతో పేద భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# చట్టా లపై అవగాహన కల్పించిన పోలీసు, రెవిన్యూ అధికారులు

జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఆదేశాల మేరకు



**నారాయణపేట, ఆగస్టు,31 (సమయం న్యూస్)** ప్రతి నెల చివరి తేదిన పౌర హక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే) నిర్వహించడం జరుగుతుంది అని నారాయణపేట జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీస్, రెవెన్యూ అధికారులు కొన్ని గ్రామాలను సందర్శించి ప్రతి నెల చివర పౌర హక్కుల దినోత్సవం నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు.కొన్ని సంవత్సరముల క్రితం కుల వివక్ష ఉండేది అని ప్రస్తుతం అంతగా లేనప్పటికీ అక్కడక్కడ గ్రామాలలో ఉన్న అసమానతలను అంటరానితనాన్ని,కుల వివక్షను నిర్మూలించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దానికి కృషి చేయాలని అన్నారు. కుల నిర్మూలనకు, ఎస్సీ ఎస్టీ కులాల వారిని చైతన్య పరుచుటకు, వారిని అభివృద్ధి వైపు నడిపించుటకు పోలీస్ శాఖ గ్రామాలలో రెవెన్యూ శాఖ అధికారుల సమన్వయంతో పౌరహక్కుల రక్షణ దినోత్సవం నిర్వహించడం జరుగుతుంది అని అన్ని కులాలకు చెందిన వారిని గ్రామాలలో సమావేశం నిర్వహించి చట్టాలను అమలు చేయు విధానం గురించి అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురావడం కుల వివక్ష నిర్మూలనపై అవగాహన కల్పించడం వల్ల అందరికి అవగాహన చైతన్యం ఉంటుందని అన్నారు.పౌర హక్కుల దినం నిర్వహించడం గ్రామాల్లో ఇంకా కుల వివక్ష అంటరానితనము దళితుల భూవివాదాలు మహిళలపై అత్యాచారాలు నిరోధించడం జరుగుతుందన్నారు.కులం పేరుతో ఎవరినైనా దూషిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని, అంటరానితనం నేరమన్నారు. కులమతాల్లో తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా ఐకమత్యంగా ఉండాలని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ అధికారులు గ్రామ ప్రజలు మొదలగు వారు పాల్గొన్నారు.

# మేనిఫెస్టో హామీలను వెంటనే అమలు చేయాలి

- కార్మికుల హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమిస్తాం.. సెప్టెంబర్ 2 నుంచి 10 వరకు ఆందోళనలు... బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు



**నర్సంపేట/వరంగల్, ఆగస్టు 31 (సమయం న్యూస్) :** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంఘటిత, అసంఘటిత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు మూడు సంవత్సరాలు పూర్తవుతున్నా కార్మికులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదని విమర్శించారు. కార్మికుల హక్కుల సాధన కోసం అన్ని వర్గాలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యువరాజు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లు వీవోఏలు, గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.18 వేలు అందిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర స్థాయిలో ఫెడరేషన్ ఏర్పాటు చేస్తామని, ఆటో కార్మికులకు జీవన భృతిగా నెలకు రూ.12 వేలు అందించడంతో పాటు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చినా వాటి అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుంచి 10 వరకు వివిధ కార్మిక వర్గాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్ట నున్నట్లుతెలిపారు. సెప్టెంబర్ 2న ఆశా, అంగన్‌వాడీ, ఫీల్డ్ అసిస్టెంట్లు మధ్యాహ్న భోజన కార్మికులు; 3న భవన నిర్మాణ, బీడీ, హమాలీ, మిషన్ భగీరథ కార్మికులు; 4న జీహెచ్ఎంసీ, మున్సిపల్ కార్మికులు ; 5న పబ్లిక్ సెక్టార్ ఆర్టీసీ, విద్యుత్, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ రంగాల కార్మికులు ఆందోళనల్లో పాల్గొంటారని వివరించారు. అలాగే సెప్టెంబర్ 6న ఆటో, ట్యాక్సీ, లారీ, గిగ్ వర్కర్లు, సింగరేణి కార్మికులు; 7న ప్రైవేట్ పరిశ్రమలు, వైద్యశాఖ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు; 8న వీవోఏ, ఆర్పీ, జీహెచ్ఎంసీ చెత్త బండ్ల కార్మికులు; 9న స్ట్రీట్ వెండర్లు, హోటల్, గ్రామపంచాయతీ కార్మికులు తమ సమస్యలపై నిరసన కార్యక్రమాలు చేపడతారని తెలిపారు. సెప్టెంబర్ 10న ఎన్జీవోలు, ఉద్యోగ సంఘాల పోరాటాలకు సంఘీభావం ప్రకటించే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆయా కార్యక్రమాల్లో భాగంగా కలెక్టర్లు, సంబంధిత ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించనున్నట్లు చెప్పారు. కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేసి వారి సమస్యలను పరిష్కరించాలని యువరాజు కోరారు. సెప్టెంబర్ 2 నుంచి నిర్వహించనున్న కార్యక్రమాల్లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పాలడుగుల రమేష్, హమాలీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కొల్లూరి లక్ష్మీనారాయణ, నవతెలంగాణ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు కందికొండ శ్రీనివాస్, దాడువాయి యూనియన్ రాష్ట్ర నాయకుడు పెరమండ్ల రవి తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే ప్రాజెక్టు ల పెండింగ్ సమస్యలు వేగంగా పరిష్కరించాలి:

## సీఎస్ సంజయ్ జాజు

**హైదరాబాద్, ఆగస్టు 31:,(సమయం న్యూస్)** రాష్ట్రంలో పురోగతిలో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. సోమవారం సచివాలయంలో దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవతో కలిసి రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షించారు. రాష్ట్రంలో రూ.50,870 కోట్ల అంచనా వ్యయంతో 17 రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి 2,023 కిలోమీటర్ల విస్తరణకు డీపీఆర్‌లు రైల్వే బోర్డుకు సమర్పించినట్లు అధికారులు తెలిపారు. భూసేకరణ, అండర్‌పాస్‌లు, ఓవర్‌బ్రిడ్జిలు, డబ్లింగ్ పనులు, అప్రోచ్ రోడ్లు, చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు రవాణా సదుపాయాలు సహా 21 అంశాలను సమావేశంలో సమీక్షించారు. ఫ్యూచర్ సిటీ, ORR, RRR పరిధిలో రైల్వే లైన్ల విస్తరణకు ప్రణాళికలు రూపొందించాలని సీఎస్ సూచించారు. అలాగే పీఎం గతిశక్తి కింద నిధుల కోసం సమగ్ర డీపీఆర్‌లు, MMTS విస్తరణ, కొత్త టెర్మినల్స్, భవిష్యత్ రైల్వే కనెక్టివిటీ, బుల్లెట్ ట్రైన్ మార్గాలకు అవసరమైన భూసేకరణపై ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

# కేసముద్రం ప్రగతికి బాటలు.. మౌలిక వసతులపై దృష్టి

- మంత్రులతో కలిసి అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**కేసముద్రం/మహబూబాబాద్, ఆగస్టు 31 (సమయం న్యూస్) :** కేసముద్రం మండలంలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. కేసముద్రం పర్యటనకు వచ్చిన రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా–శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్‌లను ఎమ్మెల్యే నాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో నూతన సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవం, మున్సిపల్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాల్లో సహచర ఎమ్మెల్యేలతో కలిసి పాల్గొన్నారు. అనంతరం కేసముద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభకు హాజరై ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. కేసముద్రం ప్రాంతంలో మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం చేపడుతున్న పనులను ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని ఈ సందర్భంగా నేతలు సూచించారు. కార్యక్రమాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# 21 కిలోమీటర్ల హాఫ్ మారథాన్ ను విజయవంతం

## ...ఫిట్నెస్ కు ప్రాధాన్యత ఇవ్వాలి.. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలి: ఎస్పీ



**నారాయణపేట, ఆగస్టు ,31(సమయం న్యూస్)**

హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజా నుండి గచ్చిబౌలి స్టేడియం వరకు నిర్వహించిన 21 కిలోమీటర్ల హాఫ్ మారథాన్ రన్నింగ్ పోటీలో నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS మరియు డీసీఆర్‌బీ డీఎస్పీ మహేష్ పాల్గొని, మారథాన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు.రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఈ హాఫ్ మారథాన్‌లో పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, యువత, క్రీడాకారులు, ఫిట్‌నెస్ ప్రియులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆరోగ్యం, ఫిట్‌నెస్, క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ ఉత్సాహంగా పాల్గొని 21 కిలోమీటర్ల పరుగును పూర్తి చేశారు.పోలీస్ శాఖలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటం ఎంతో అవసరమని భావిస్తున్న ఎస్పీ, నారాయణపేట జిల్లాలో కూడా పోలీస్ సిబ్బంది ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని సీఐలు,ఎస్సైలు మరియు ఇతర పోలీస్ సిబ్బందికి లాంగ్ రన్నింగ్, సైక్లింగ్ తదితర ఫిట్‌నెస్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ మాట్లాడుతూ... పోలీసు విధుల్లో శారీరక దృఢత్వం, మానసిక ఆరోగ్యం ఎంతో కీలకం. ప్రతి ఒక్కరూ తమ రోజువారీ జీవితంలో కొంత సమయం వ్యాయామం, రన్నింగ్, సైక్లింగ్, యోగా, ధ్యానం వంటి ఆరోగ్యకరమైన కార్యకలాపాలకు కేటాయించాలి. ఫిట్‌నెస్ అనేది కేవలం పోలీసులకు మాత్రమే పరిమితం కాకుండా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలి.నారాయణపేట జిల్లా ప్రజలు, యువత, విద్యార్థులు పోలీస్ శాఖ నిర్వహిస్తున్న ఫిట్‌నెస్ కార్యక్రమాలను ఆదర్శంగా తీసుకొని ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి.ప్రతిరోజూ రన్నింగ్ లేదా వాకింగ్ చేయడం, యోగా, ధ్యానం వంటి వాటిని అలవాటుగా మార్చుకోవాలి. ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉంటేనే మన రోజువారీ పనులను మరింత ఉత్సాహంతో, సమర్థవంతంగా నిర్వహించగలుగుతాం.యువత క్రీడల వైపు, ఫిట్‌నెస్ వైపు దృష్టి సారించాలి. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలి" అని ఎస్పీ తెలిపారు.21 కిలోమీటర్ల హాఫ్ మారథాన్‌ను పూర్తి చేయడం ద్వారా ఫిట్‌నెస్ పై తనకున్న నిబద్ధతను జిల్లా ఎస్పీ మరోసారి చాటిచెప్పారు. పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు జిల్లా యువత, విద్యార్థులకు కూడా ఇది స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

## ప్రజల ఆశలు.. హామీల మాయ.. వెయ్యి రోజుల పాలన

- కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్యాలపై బీఆరెస్ సమరభేరి..
- సెప్టెంబర్ 2 నుంచి 9 వరకు బీఆర్ఎస్ పోరుబాట.. 6 గ్యారెంటీలు, 420 హామీల అమలుపై ప్రజల్లోకి వెళ్లాలి
- ప్రజా సమస్యలను ఎండగట్టేందుకు వినూత్న నిరసనలు చేపట్టాలి... దాస్యం వినయ్ భాస్కర్
- హామీల మోసంపై సమరశంఖం.. కాంగ్రెస్ పై బీఆర్ ఎస్ పోరుబాట



**హనుమకొండ, ఆగస్టు 31 (సమయం న్యూస్) :** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ సెప్టెంబర్ 2 నుంచి 9 వరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టనున్న పోరుబాటను విజయవంతం చేయాలని మాజీ చీఫ్ విప్ , మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ , సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పిలుపు మేరకు హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించి కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వినయ్భాస్కర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలు, 13 డిక్లరేషన్ల అమలులో వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల సమయంలో వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో వివిధ వర్గాలకు ఇచ్చిన హామీలు, వాటి అమలులో జరిగిన జాప్యాన్ని ప్రజలకు వివరించేలా వారం రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో వినూత్న నిరసన కార్యక్రమాలు చేపట్టి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. వివిధ వర్గాలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను మరోసారి 'బాకీ కార్డుల' రూపంలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని వినయ్భాస్కర్ సూచించారు. ఆయా వర్గాలకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు, నెరవేర్చాల్సిన హామీలను ప్రజలకు వివరించి చైతన్యపరచాలని అన్నారు. వెయ్యి రోజుల పాలనలో ప్రభుత్వం ఏయే రంగాల్లో విఫలమైందో, ప్రజలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి, హామీల అమలులో జాప్యాన్ని ప్రజల ముందుంచేందుకు సెప్టెంబర్ 2 నుంచి 9 వరకు చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమాజంలోని అన్ని వర్గాలను భాగస్వాములను చేస్తూ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. సమావేశంలో మాజీ కూడాచైర్మన్ మర్రి యాదవరెడ్డి, మాజీ కార్పొరేటర్లు, మాజీ డివిజన్ అధ్యక్షులు, లీగల్ సెల్ బాధ్యులు, మహిళా డివిజన్ అధ్యక్షులు, విద్యార్థి విభాగం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 18 నెలల చిన్నారి గుండె ఆపరేషన్ కు సీతలే రమేష్ ఉదారత:

### వాట్సాప్ స్టేటస్ తో 50 వేల విరాళాల సేకరణ!

**పోతంగల్, ఆగష్టు 31 (సమయం న్యూస్ ) :–** పోతంగల్ మండల కేంద్రంలోని హెగ్డోలి గ్రామానికి చెందిన శ్రీహిత–కళ్యాణ్ దంపతుల 18 నెలల చిన్నారి మహాన్వీ తీవ్ర గుండె సంబంధిత సమస్యతో బాధపడుతోంది. పాప ప్రాణాలు కాపాడేందుకు వైద్యులు అత్యవసరంగా రెండు ఆపరేషన్లు చేయాలని సూచించారు. కాగా, ప్రస్తుత ఆపరేషన్ నిమిత్తం సుమారు ₹15 లక్షల వరకు ఖర్చవుతుందని తెలపడంతో, పేద కుటుంబానికి చెందిన ఆ దంపతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు. చిన్నారి పరిస్థితిని చూసి కలచివేతకు గురైన హెగ్డోలి గ్రామస్తులు, బాధిత కుటుంబాన్ని స్థానిక దాత సీతలే రమేష్ అన్నను కలవాల్సిందిగా సూచించారు. గ్రామస్తులు ఫోన్ ద్వారా విషయాన్ని రమేష్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన తక్షణమే స్పందించారు.కేవలం 2 రోజుల్లోనే తన వాట్సాప్ స్టేటస్ ద్వారా మిత్రులు, దాతల నుంచి ₹50,000 నగదు సేకరించారు. ఆ మొత్తాన్ని ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను నేరుగా వారి ఇంటికి వెళ్లి అందజేశారు. అంతటితో ఆగకుండా, పాప ఆపరేషన్కు కావలసిన మిగతా మొత్తం కోసం ఇతర మార్గాల ద్వారా కూడా సహాయం అందిస్తానని రమేష్ భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా పాప తల్లిదండ్రులు మాట్లాడుతూ —"మా పాప ప్రాణాలు కాపాడేందుకు ముందుకొచ్చిన సీతలే రమేష్ అన్నకు, అలాగే ఆయన పిలుపునందుకుని ఆర్థిక సహాయం అందించిన ప్రతి ఒక్కరికీ మా కుటుంబం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుంది" అని కంటతడి పెట్టుకుంటూ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో దుమలే అర్జున్ పటేల్,ముప్వ రత్నాకర్, మంగలి విశ్వనాథ్,కిరణ్,సుధాకర్ రెడ్డి, లక్ష్మణ్, సుకృత్ మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వికలాంగుల కాలనీలో డ్రైనేజీ, రోడ్లు నిర్మించాలి



**మల్కాజిగిరి ఆగస్టు 31( సమయం న్యూస్):** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కీసర సర్కిల్–1, దమ్మాయిగూడ డివిజన్–4 పరిధిలోని శ్రీ రామలింగేశ్వర కాలనీలో అండర్గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్ల సౌకర్యాలు కల్పించాలని సీపీఎం కీసర మండల కమిటీ కోరింది. సోమవారం ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం సమర్పించింది. వికలాంగులు నివసిస్తున్న ఈ కాలనీలో డ్రైనేజీ, రహదారుల సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు ప్రత్యేక శ్రద్ధతో వెంటనే మౌలిక వసతులు కల్పించాలని మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు కోరారు. కార్యక్రమంలో శివన్నారాయణ, కలువల శ్రీనివాస్, నితిన్, కలమ్మ, తార, పోచమ్మ, రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీ ఐ అమలులో నిర్లక్ష్యం..

- సిద్దిపేట కలెక్టరేట్కు రూ.10 వేల జరిమానా
- రెండు వారాల్లో పూర్తి సమాచారం ఇవ్వాలని రాష్ట్ర సమాచార కమిషన్ ఆదేశాలు

**సిద్దిపేట, ఆగస్టు 31:** సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద దాఖలు చేసిన దరఖాస్తులకు సమాచారం అందించడంలో నిర్లక్ష్యం వహించిన సిద్దిపేట కలెక్టరేట్ అధికారులపై రాష్ట్ర సమాచార కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. గతంలో కమిషన్ ఇచ్చిన ఆదేశాలను సైతం అమలు చేయకపోవడాన్ని తప్పుబట్టిన కమిషన్.. బాధిత దరఖాస్తుదారులకు మొత్తం రూ.10 వేల నష్టపరిహారం చెల్లించడంతో పాటు, పెండింగ్లో ఉన్న పూర్తి సమాచారాన్ని రెండు వారాల్లో అందించాలని ఆదేశించింది. వేములఘాట్కు చెందిన ఎండీ హాయతుద్దీన్, ఏటిగడ్డ కిష్టాపూర్కు చెందిన సందబోయిన అశోక్, లక్ష్మాపూర్కు చెందిన



ప్రభాకర్ ఆర్టీఐ చట్టం కింద కలెక్టరేట్కు పలు దరఖాస్తులు సమర్పించారు. అయితే నిర్ణీత గడువులోగా సమాచారం అందకపోవడంతో వారు రాష్ట్ర సమాచార కమిషన్ను ఆశ్రయించారు. ఇప్పటికే 16.09.2025న రెండు వారాల్లోగా సమాచారం అందించాలని రాష్ట్ర సమాచార కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ కలెక్టరేట్ అధికారులు ఆ ఆదేశాలను అమలు చేయకపోవడంతో బాధితులు 04.02.2026న మరోసారి కమిషన్కు ఫిర్యాదు చేశారు.

ఈ ఫిర్యాదులపై 20.07.2026న విచారణ నిర్వహించిన సమాచార కమిషన్.. అధికారుల తీరును తప్పుబడుతూ జరిమానా, నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది.

**ఎవరికి ఎంత?**

ఎండీ హాయతుద్దీన్కు: సమాచారం అందించని ఐదు దరఖాస్తులకు కలిపి రూ.6,000

సందబోయిన అశోక్కు: ఒక దరఖాస్తుకు రూ.2,000

ప్రభాకర్కు: ఒక దరఖాస్తుకు రూ.2,000

మొత్తం రూ.10,000లను దరఖాస్తుదారులకు చెల్లించాలని కమిషన్ స్పష్టం చేసింది. అంతేకాకుండా పెండింగ్లో ఉన్న సమాచారాన్ని ఎలాంటి జాప్యం లేకుండా రెండు వారాల్లోగా పూర్తిగా అందించాలని అధికారులను ఆదేశించింది.

**ముంపు నిర్వాసితుల సమస్యలపై ప్రశ్నించేందుకే..**

తాము గతంలో ముంపు నిర్వాసితులకు జరిగిన అన్యాయాలపై ప్రశ్నిస్తూ ఆర్టీఐ దరఖాస్తులు చేసుకున్నామని బాధితులు తెలిపారు. తమ దరఖాస్తుల ద్వారా అధికారుల తప్పిదాలు వెలుగులోకి వస్తాయనే ఉద్దేశంతోనే సమాచారం ఇవ్వకుండా అధికారులు ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని వారు ఆరోపించారు. ఆర్టీఐ చట్టం కింద ప్రజలు కోరిన సమాచారాన్ని నిర్ణీత గడువులో అందించడం అధికారుల బాధ్యత అని, కమిషన్ ఆదేశాలను సైతం పట్టించుకోకపోవడం తీవ్ర నిర్లక్ష్యమని ఈ తీర్పు మరోసారి స్పష్టం చేసింది.

# ఒంటరిగా నివసించే వితంతు, వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని దృష్టి మరల్చి.

- బంగారు ఆభరణాల దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర నిందితురాలు అరెస్ట్
- తాండూరు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 5 కేసులు, కర్ణాటక రాష్ట్రంలో 3 కేసులు ఛేదింపు
- సాంకేతిక ఆధారాలతో నిందితురాలిని గుర్తించిన వికారాబాద్ CCS ఇన్స్పెక్టర్ బల్వంత్ రాయ్

**వికారాబాద్, ఆగస్టు,31((సమయం న్యూస్)** వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS ఆదేశాల మేరకు జిల్లాలో మహిళలు, వృద్ధుల భద్రతకు పోలీసులు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారు. ముఖ్యంగా ఒంటరిగా నివసించే వితంతు మహిళలు, వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని వారి దృష్టిని మరల్చి బంగారు ఆభరణాలను అపహరిస్తున్న నేరాలపై జిల్లా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు.ఈ నేపథ్యంలో తాండూరు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా చోటుచేసుకున్న దొంగతనాల కేసులను ఛేదించేందుకు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS వికారాబాద్ CCS ఇన్స్పెక్టర్ బల్వంత్ రాయ్ కి ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు.జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు CCS ఇన్స్పెక్టర్ బల్వంత్ రాయ్ ఈ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, నిరంతరం దర్యాప్తు చేపట్టారు. నేరాలు జరిగిన ప్రాంతాలు, నేరాల తీరును క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు, సాంకేతిక ఆధారాలను విశ్లేషిస్తూ నిందితురాలి కదలికలను గుర్తించారు. దర్యాప్తులో భాగంగా వివిధ ప్రాంతాల్లో నిందితురాలి కదలికలు, గతంలో ఆమె పాల్పడిన నేరాల వివరాలు, నేరం చేసిన విధానం తదితర అంశాలను విశ్లేషించారు. ఈ క్రమంలో మహిళలను లక్ష్యంగా చేసుకుని వారి దృష్టిని మరల్చి బంగారు ఆభరణాలను అపహరిస్తున్న అంతర్రాష్ట్ర నిందితురాలిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

**నిందితురాలి నేర విధానం**

నిందితురాలు ప్రధానంగా ఒంటరిగా నివసించే వితంతు మహిళలు, వృద్ధ మహిళలను గుర్తించి వారిని లక్ష్యంగా చేసుకునేది. ముందుగా వారితో పరిచయం ఏర్పరచుకుని, వివిధ విషయాలపై మాట్లాడటం, వారి దృష్టిని మరల్చడం వంటి పద్ధతులను ఉపయోగించి, వారు ధరించిన బంగారు గొలుసులు, నెక్లెస్లు, గాజులు తదితర ఆభరణాలను అపహరించేది.నిందితురాలు ఒకే ప్రాంతానికి పరిమితం కాకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లి కూడా ఇదే తరహాలో నేరాలకు పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.CCS ఇన్స్పెక్టర్ బల్వంత్ రాయ్ నేతృత్వంలో చేపట్టిన దర్యాప్తులో నిందితురాలి నేరాలకు సంబంధించిన కీలక ఆధారాలను సేకరించి, ఆమె ప్రమేయం ఉన్న కేసులను గుర్తించారు.

**నిందితురాలిని గుర్తించడంలో CCS ఇన్స్పెక్టర్ బల్వంత్ రాయ్ కీలక పాత్ర**

వరుసగా నమోదైన ఈ కేసులను ఛేదించేందుకు వికారాబాద్ CCS ఇన్స్పెక్టర్ బల్వంత్ రాయ్ ప్రత్యేక బృందంతో కలిసి నిరంతరం దర్యాప్తు చేపట్టారు.నేరం జరిగిన ప్రాంతాలు, బాధితుల వివరాలు, నేరం జరిగిన విధానం, నిందితురాలి కదలికలు, సాంకేతిక ఆధారాలు తదితర అంశాలను సమగ్రంగా విశ్లేషించి, కేసుల మధ్య ఉన్న సారూప్యతలను గుర్తించారు. తాండూరులో నమోదైన కేసులకు, కర్ణాటక రాష్ట్రంలో నమోదైన కేసులకు మధ్య ఉన్న నేర విధానాన్ని పోల్చి పరిశీలించడం ద్వారా నిందితురాలి ప్రమేయాన్ని గుర్తించడం జరిగింది.CCS ఇన్స్పెక్టర్ బల్వంత్ రాయ్ గారి నిరంతర కృషి, సమర్థ



వంతమైన దర్యాప్తు, సాంకేతిక ఆధారాల విశ్లేషణ ఫలితంగా నిందితురాలిని గుర్తించి అరెస్ట్ చేయడం జరిగింది.CCS అధికారులు నిందితురాలి క్రిమినల్ బ్యాక్గ్రౌండ్ను కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. దర్యాప్తులో నిందితురాలిపై గతంలో మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లాలో MIDC పోలీస్ స్టేషన్ పరిధిలో 3 కేసులు, బర్షి పోలీస్ స్టేషన్ పరిధిలో 1 కేసు, హైదరాబాద్ సిటీ మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో 1 కేసు నమోదైనట్లు గుర్తించారు.

**మహిళలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలి: CCS ఇన్స్పెక్టర్ బల్వంత్ రాయ్**

ఈ సందర్భంగా CCS ఇన్స్పెక్టర్ బల్వంత్ రాయ్ మాట్లాడుతూ, ఒంటరిగా నివసించే వితంతు మహిళలు, వృద్ధులు ముఖ్యంగా అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.తమ దృష్టిని మరల్చే విధంగా ఎవరైనా ప్రయత్నించినా,అనుమానాస్పదంగా ప్రవర్తించినా వెంటనే అప్రమత్తమై సమీప పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని తెలిపారు.మహిళలు విలువైన బంగారు ఆభరణాలను ధరించి ఒంటరిగా బయటకు వెళ్లే సమయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని, అపరిచితుల మాటలను నమ్మి వారి వెంట వెళ్లడం లేదా వ్యక్తిగత వివరాలను వెల్లడించడం చేయవద్దని సూచించారు.జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని CCS ఇన్స్పెక్టర్ బల్వంత్ రాయ్ తెలిపారు.ఈ కేసుల దర్యాప్తును ప్రత్యేకంగా పర్యవేక్షించిన వికారాబాద్ CCS ఇన్స్పెక్టర్ బల్వంత్ రాయ్, తాండూరు టౌన్ SI మమత ఆధ్వర్యంలో HCలు జయవర్ధన్, శివకుమార్, PCలు రామకృష్ణ, సాయప్ప,శివరాజ్, పాండు, రాజు, రవీందర్ మరియు WPC గాయత్రి సమన్వయంతో పనిచేశారు.ఈ కేసులను ఛేదించడంలో సమర్థవంతంగా పనిచేసిన పోలీస్ అధికారులను, సిబ్బందిని జిల్లా అదనపు ఎస్పీ రాజేశ్ మీనా, IPS అభినందించారు.

**తాండూరు టౌన్ PS పరిధిలో 5 కేసులు ఛేదింపు**

నిందితురాలి ప్రమేయం ఉన్న తాండూరు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 5 కేసుల్లో మొత్తం కలిపి సుమారు 9.5 తులాల బంగారు ఆభరణాలు అపహరించినట్లు గుర్తించారు.తాండూరు కేసుల దర్యాప్తు సందర్భంగా నిందితురాలు గతంలో కర్ణాటక రాష్ట్రంలోని గదగ్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2 కేసులు, నవనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 1 కేసు ఇదే తరహా నేరాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఈ మూడు కేసుల్లో మొత్తం 14.5 తులాల బంగారు ఆభరణాల దొంగతనాలకు సంబంధించి కూడా నిందితురాలి ప్రమేయం ఉన్నట్లు అధికారులు దర్యాప్తులో గుర్తించారు.

# కిషోర్ కుమార్ సేవలు మరువలేనివి: జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

### బదిలీలు, పదవీ విరమణలు ఉద్యోగ జీవితంలో సహజమే

**నిర్మల్ ఆగస్టు31( సమయం న్యూస్,)** జిల్లాకు రెవెన్యూ అదనపు కలెక్టర్గా కిషోర్ కుమార్ అందించిన సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. ప్రతి ఉద్యోగి జీవితంలో బదిలీలు, పదవీ విరమణలు సహజమని పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ వరంగల్ జిల్లాకు బదిలీపై వెళ్తున్న సందర్భంగా వీడ్కోలు కార్యక్రమం, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బాలిగ్ అహ్మద్, ఏడి ల్యాండ్ సర్వే రికార్డ్స్ నరసింహమూర్తి పదవీ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కిషోర్ కుమార్ రెవెన్యూ అదనపు కలెక్టర్గా భూ సమస్యల పరిష్కారం, ధాన్యం కొనుగోళ్లు, ఎన్నికల నిర్వహణ తదితర అంశాల్లో సమర్థ వంతంగా



విధులు నిర్వర్తించారని ప్రశంసించారు. ముఖ్యంగా ధాన్యం కొనుగోళ్లను సకాలంలో, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తి చేయడంలో ఆయన కీలకంగా పనిచేశారని అభినందించారు. వరంగల్ జిల్లాలోనూ ఇదే అంకితభావంతో పనిచేసి మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. అలాగే, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిగా బాలిగ్ అహ్మద్, ఏడి ల్యాండ్ సర్వే రికార్డ్స్గా నరసింహమూర్తి సుదీర్ఘకాలం క్రమశిక్షణతో విధులు నిర్వహించి అందరి మన్ననలు పొందారని కలెక్టర్ తెలిపారు. అనుభవజ్ఞులైన ఈ అధికారులు పదవీ విరమణ చేయడం జిల్లాకు లోటేనని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో ఆరోగ్యంగా, ఆనందంగా భావి జీవితాన్ని గడపాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. వీడ్కోలు సందర్భంగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్ మాట్లాడుతూ, నిర్మల్ జిల్లాలో విధులు నిర్వహించడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. తన విధుల నిర్వహణలో సహకరించిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. భూ సమస్యల పరిష్కారం, ప్రజావాణి నిర్వహణ, ఎన్నికల విధులు, వరదల సమయంలో సహాయక చర్యల్లో పాల్గొనడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. ప్రతి అధికారి ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

# మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

### పలువురు మహిళా వక్తల పిలుపు

**ఖమ్మం, ఆగస్టు 31 : ( సమయం న్యూస్ )** మహిళలు తమలోని సామర్థ్యాన్ని గమనించి, ఆత్మవిశ్వాసంత ముందుకు సాగాలని పలువురు మహిళా వక్తలు పిలుపునిచ్చారు. సోమవారం జమాత్రే ఇస్లామి హింద్ సౌత్ శాఖ ఆధ్వర్యంలో అధ్యక్షురాలు నాజియా తబ్బాసుమ్ అధ్యక్షతన జరిగిన మహిళా విద్యావేత్తల రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు మహిళా భక్తులు పాల్గొని ప్రసంగించారు. అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఖమ్మం అధ్యక్షురాలు అజిత, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ సమ్రిన్, జాగృతి ఎన్జీవో మెంబర్ మాధవి, స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్, మెంటర్ సల్మా ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ వివిధ రంగాలలో పనిచేస్తున్న మహిళల మధ్య అనుభవాల మార్పిడి, పరస్పర సహకారం,



సమన్వయం ద్వారా మరిన్ని సామాజిక కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. మహిళలను ప్రేరేపించడం నాయకత్వ లక్షణాలను పెంపొందించడం వారి సామర్థ్యాలను సమాజ శ్రేయస్సుకు వినియోగించడం ద్వారా బలమైన,బాధ్యతాయుతమైన, అభివృద్ధి చెందిన సమాజా నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. జమ తెలయం మీ హిందూ ఖమ్మం నగర శాఖ అధ్యక్షురాలు అస్మా అంజుమ్, జమాతే ఇస్తమ హిందూ ఖమ్మం పిఆర్ కన్వీనర్ హాజీరా మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త ( స అసం ) జీవితం మనందరికీ మార్గదర్శకమని, ఆయన ప్రజల పట్ల ఎంతో జాలి, కరుణ, ఆదరణ చూపించే వారని, ఆయన నోటి ద్వారా చేతల ద్వారా ఎప్పుడు ఏ ఒకరికి ఇబ్బంది కలిగించలేదని, మనం కూడా ఆయనను ఆదర్శంగా తీసుకొని మన జీవితాలను చక్కదిద్దుకోవాలని పేర్కొన్నారు. మహమ్మద్ ప్రవక్త ఒక కొడుకుగా, ఒక తండ్రిగా, ఒక సోదరుడుగా, ఆదర్శ దైవదాసుడిగా, గొప్ప పరిపాలకుడి గా, ఒక స్నేహితుడిగా, ఆయన ఆదర్శ జీవితం, జీవిత చరిత్ర తెలుసుకొని, ఆచరించవలసిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆయన ఆదర్శ భోధనాలు పాటిస్తే సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, సోదర భావం వెలసిల్లుతాయని తెలిపారు. కార్యక్రమంలో నార్త్ మహిళ విభాగం అధ్యక్షురాలు హుస్నేన్ బి, నసీమా, సురయ్య, అఫ్సర్, సా జీ దా, మదిహా, రేష్మ , షాకిరా,మహిళా విద్యావేత్తలు పాల్గొన్నారు.

# ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని చదవాలి

### జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక.

**నారాయణపేట, ఆగస్టు,31( సమయం న్యూస్)** ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధన కోసం క్రమశిక్షణతో నిత్యం సాధన చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక విద్యార్థినులకు సూచించారు.సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఎర్రగుట్ట వద్ద గల గురుకుల బాలికల పాఠశాల/కళాశాలను జిల్లా కలెక్టర్ సందర్శించి ఇంటర్మీడియట్ విద్యార్థినులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఒక్కొక్కరినీ వారి ఇష్టమైన సబ్జెక్టులు, భవిష్యత్ లక్ష్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.ఇంటర్మీడియట్ అనంతరం ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలకు సంబంధించి స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా నీట్ కు ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో సిద్ధం కావాలని, ప్రతిరోజూ కొంత సమయం కేటాయించి చదువుతో పాటు పునశ్చరణ, మాక్ టెస్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.విద్యార్థినులు తమకు ఆసక్తి ఉన్న రంగంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి కష్టపడి పనిచేయాలని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. చదువులో లేదా వసతి, భోజనం, ఇతర సౌకర్యాలకు సంబంధించి ఏవైనా



ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకు రావాలని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.విద్యార్థినులతో కలెక్టర్ స్వయంగా ముచ్చటించడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు.

# పదేళ్లలో చేయనిది.. రెండున్నరేళ్లలో చేసి చూపించాం

- వరంగల్ అభివృద్ధిపై చర్చకు సిద్ధం
- బీజేపీ, బీఆర్ఎస్ నేతల విమర్శలకు ఆధారాల్లేవు..
- అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలను ప్రజలు నమ్మొద్దు... ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



**హనుమకొండ, ఆగస్టు 31 (సమయం న్యూస్) :** వరంగల్ అభివృద్ధిపై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలకు ఆధారాలు లేవని, గత పదేళ్ల పాలనలో జరగని అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో చేపట్టిందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. వరంగల్ అభివృద్ధికి సంబంధించిన ప్రతి అంశంపై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్‌ను విమర్శించడమే రాజకీయ లక్ష్యంగా కొందరు బీజేపీ, బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వాస్తవాలు తెలుసుకోకుండా, ఆధారాలు లేని ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు. రాజకీయ విమర్శలు చేయాలంటే వాస్తవాలు, ఆధారాలతో మాట్లాడాలని సూచించారు. గత ప్రభుత్వాల హయాంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నదని నాయిని ఆరోపించారు. ఉద్యోగులు, ప్రభుత్వ వ్యవస్థలకు సంబంధించిన అనేక సమస్యలను గత పాలకులు నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. ఆర్థికపరమైన సవాళ్లు ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతోందని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అంశాన్ని కూడా కొందరు రాజకీయంగా వాడుకుంటున్నారని మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు. వరంగల్ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని నాయిని చెప్పారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టుకు సుమారు రూ.5,300 కోట్లు, శాశ్వత తాగునీటి వసతుల కోసం రూ.550 కోట్లకు పైగా నిధులతో పనులు చేపడుతున్నామని వివరించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నగర నీటి సరఫరా వ్యవస్థను ఆధునీకరిస్తున్నామని, నిజాం కాలం నాటి ఫిల్టర్ బెడ్ల స్థానంలో ఆధునిక వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు పాత పైప్‌లైన్ల సామర్థ్యాన్ని పెంచుతున్నామని తెలిపారు. వరంగల్ ఎయిర్‌పోర్టు విషయంలో గత పదేళ్లు అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు మాట్లాడటం విడ్డూరంగా ఉందని నాయిని అన్నారు. వారి హయాంలో విమానాశ్రయానికి కనీసం అవసరమైన అనుమతులు కూడా తీసుకురాలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవసరమైన అనుమతుల కోసం కృషి చేయడంతో పాటు భూసేకరణకు భారీగా నిధులు కేటాయించి ప్రక్రియను ముందుకు తీసుకెళ్తోందని చెప్పారు. రింగ్‌రోడ్డు నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాల అభివృద్ధికి ఇటీవల రూ.25 కోట్లు మంజూరు చేయించామని, పాలిటెక్నిక్ కళాశాలకు కూడా నిధులు తీసుకొచ్చామని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తున్నారని, తాను ప్రతిపాదించిన అభివృద్ధి పనులకు సానుకూలంగా స్పందిస్తున్నారన్నారు.కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందని నాయిని తెలిపారు. కోచ్ ఫ్యాక్టరీ కోసం భూసేకరణకు చర్యలు తీసుకుంటున్నామని, విభజన చట్టంలో ఇచ్చిన హామీని అమలు చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కాజీపేట, వరంగల్ అభివృద్ధికి సంబంధించి బీజేపీ, బీఆర్ఎస్ నేతలు బహిరంగ చర్చకు రావాలని నాయిని సవాల్ చేశారు. గత పదేళ్లలో వారి ప్రభుత్వాలు ఏం చేశాయి, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏం చేసిందో ప్రజల సమక్షంలో తేల్చుకుందామని స్పష్టం చేశారు. కార్పొరేషన్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కొందరు నేతలు రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లోకి వస్తున్నారని విమర్శించారు. ఎన్నికలు వచ్చినప్పుడే ప్రజల మధ్యకు వచ్చే సీజనల్ రాజకీయ నాయకులను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. గత పదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన పనులను ప్రజలు బేరీజు వేసుకోవాలని కోరారు. మీ కళ్ల ముందే జరుగుతున్న అభివృద్ధిని చూసి నిర్ణయం తీసుకోండి. ఆధారాలు లేని ఆరోపణలను నమ్మొద్దని నాయిని రాజేందర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వాలే తీసుకొచ్చాయని, కులం, మతం, పార్టీ అనే తేడా లేకుండా ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ విధానమని అన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్లు జక్కుల రవీందర్, పోతుల శ్రీమాన్, గుంటి శ్రీనివాస్, మామిళ్ల రాజు, నెక్కొండ కిషన్, జిల్లా నాయకులు బంకా సరళ, బంకా సంపత్‌యాదవ్, అంబేద్కర్ రాజు, అంకుస్, తోట రాజ్‌కుమార్, మార్కు విజయ్, కూర వెంకట్, పెరుమాండ్ల రామకృష్ణ, పులి రాజు, ఆరూరి సాంబయ్య, కట్ల శ్రీనివాస్, వీరగంటి రవీందర్, గుంటి స్వప్న, రహిమున్నీసా, తడుక సుమన్, సుమన్, అనిల్, అశోక్‌రెడ్డి, ఆజాం, క్రాంతిభరత్, కొండ నాగరాజు, రహమతుల్లా, దొంగల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి లో ఐదు ఫిర్యాదులు..

### కోస్గి ఎంపిడివో శ్రీధర్

**కోస్గి మున్సిపల్, ఆగస్టు,31 (సమయం న్యూస్)** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం రోజు కోస్గి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కి ఐదు ఫిర్యాదులు అందాయని ఎంపీడీవో శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి ఫిర్యాదులను సంబంధిత శాఖ అధికారులు వెంటనే పరిష్కరించాలని అన్నారు. కాగా ఇందులో మూడు రెవెన్యూ శాఖ ఫిర్యాదులు, మరో రెండు విద్యాశాఖకు సంబంధించిన ఫిర్యాదులు అందాయని తెలిపారు. ప్రజావాణిని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు సంబంధిత శాఖ అధికారులు పరిష్కరించాలని ఎంపీడీవో సూచించారు. ఈ కార్యక్రమములో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# క్యాన్సర్ బాధితురాలికి 'కావ్య' భరోసా..

- రూ.2.50 లక్షల పీఎంఎన్ఆర్ఎఫ్ సాయం
- సమస్య తెలిసిన వెంటనే స్పందించిన వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య
- బాధిత కుటుంబానికి ఆర్థిక చేయూత.. చెక్కును అందజేసిన ఎంపీ



**హనుమకొండ, ఆగస్టు 31 (సమయం న్యూస్) :** క్యాన్సర్ మహమ్మారితో పోరాడుతున్న ఓ నిరుపేద కుటుంబానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అండగా నిలిచారు. చికిత్సకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్టేషన్‌ఘన్‌పూర్ మండలం నామిలిగొండకు చెందిన సదాల సంతోషికి ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (PMNRF) నుంచి మంజూరైన రూ.2.50 లక్షల ఆర్థిక సహాయాన్ని ఎంపీ డా. కడియం కావ్య సోమవారం అందజేశారు. సదాల సంతోషి క్యాన్సర్ చికిత్సకు ఆర్థిక సహాయం అవసరమన్న విషయం ఎంపీ డా. కడియం కావ్య దృష్టికి రాగానే ఆమె వెంటనే స్పందించారు. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి సాయం అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ అవసరమైన చర్యలు చేపట్టారు. ఎంపీ చొరవతో రూ.2.50 లక్షల ఆర్థిక సహాయం మంజూరైంది. ఈ సందర్భంగా ఎంపీ డా. కడియం కావ్య మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రజలకు అండగా నిలవడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్సకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ప్రభుత్వ పథకాల ద్వారా సహాయం అందేలా తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. క్యాన్సర్ చికిత్స కోసం ఆర్థిక సహాయం అందేలా చొరవ తీసుకున్న ఎంపీ డా.కడియం కావ్యకు సదాల సంతోషి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఆర్థిక సహాయం చికిత్సకు ఎంతో ఉపయోగపడుతుందని వారు పేర్కొన్నారు.

# ప్రజా ప్రభుత్వం తోనే పేదల సొంతింటి కల సాకారం..

### కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు బెజ్జు రాములు



**కోస్గి మున్సిపల్, ఆగస్టు,31(సమయం న్యూస్)** ప్రజా ప్రభుత్వం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తోనే పేదల సొంతింటి కల సాకారం నెరవేరిందని కోస్గి కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు బెజ్జు రాములు అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలో 13 వ వార్డులో లబ్ధిదారులతో కలిసి ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్నారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వం పేదల పక్షపాతి అని అన్నారు.గత పదేళ్లలో తెలంగాణ రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇస్తామని పేదల కు మొండి చేయి చూపిందని అన్నారు. నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నిరుపేదలకు సొంతింటి కలను నెరవేర్చు తున్నారన్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల స్వామి దేవాలయ చైర్మన్ కృష్ణమూర్తి, కౌన్సిలర్లు తుడుం శ్రీను, మాస్టర్ శ్రీను, కో ఆప్షన్ సభ్యులు ఓం ప్రకాష్,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కోటగిరి మండల సమైక్య నూతన పాలకవర్గం ఎన్నిక

**కోటగిరి, ఆగస్టు 31 (సమయం న్యూస్ )** కోటగిరి మండల సమైక్య నూతన పాలకవర్గ సమావేశాన్ని సోమవారం స్థానిక రైతు వేదికలో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం ద్వారా ఇప్పటివరకు నిర్వహించిన వివిధ ఆర్థిక లావాదేవీల వివరాలను సంబంధిత ప్రతినిధులు సభ్యులకు కూలంకషంగా తెలియజేశారు.అనంతరం మండల సమైక్య నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల సమైక్య అధ్యక్షురాలుగా ఎం. సుజాత, కార్యదర్శిగా వాగ్మారే భాగ్యశ్రీ, కోశాధికారిగా ఎం. గంగాలతతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను సమైక్య ప్రతినిధులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కోటగిరి ఎంపీడీవో విష్ణు, స్థానిక సర్పంచ్ బర్ల మధుకర్, ఏపీఎం భాస్కర్, సీసీలు సాయిబాబా, నాగరాజు, రమేష్ తదితరులు పాల్గొని నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.

# హనుమాన్ మందిరంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం

**పోతంగల్, ఆగస్టు 31 (సమయం న్యూస్ ) :-** పోతంగల్ మండల కేంద్రంలోని కల్లూరు ఎక్స్ రోడ్డు హనుమాన్ మందిరం వద్ద శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని సోమవారం శ్రీ ఆంజనేయ స్వామి భక్త బృందం, స్థానిక నిర్వాహకుల ఆధ్వర్యంలో భక్తులకు ఘనంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రావణ మాసంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం, ఆలయానికి విచ్చేసిన భక్తులకు మహా ప్రసాదంగా అన్నదానం అందించారు.ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు మాట్లాడుతూ... ప్రతి ఏటా శ్రావణ మాసంలో కల్లూరు ఎక్స్ రోడ్డు హనుమాన్ ఆలయం వద్ద ఈ అన్నదాన కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. స్వామివారి కృపతో గ్రామాభివృద్ధి, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ ప్రతి సంవత్సరం ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టడం ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక యువకులు, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.